# కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ ఆదివారం 22 డిసెంబర్ 2024
సంపుటి: 14, సంచిక: 263 పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam


## అరబిక్ భాషలో రామాయణం.. భారతం

ప్రధాని మోదీ రాక సందర్భంగా కువైట్‌లో బుక్ లీజీ
కువైట్ ఓ మినీ ఇండియా..
ప్రవాస భారతీయుల సమావేశంలో ప్రధాని మోదీ



2

## సీపీపీ కన్వీనర్‌గా మల్లు రవి



**న్యూఢిల్లీ డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ కన్వీనర్ గా నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవిని నియమిస్తూ పార్టీ అధిష్ఠానం శనివారం ఆదేశాలు జారీ చేసింది. దేశవ్యాప్తంగా సీపీపీ కన్వీనర్లను నియమిస్తూ పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి ఎంపీ అమర్ సింగ్ ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. తెలంగాణ రాష్ట్రం నుంచి మల్లు రవికి చోటు లభించింది.



### సర్పంచ్‌లు తలెత్తుకుని తిరిగేలా
# అభివృద్ధి పనులు

**డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందడుగు**
**గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యం**
**105 కోట్లతో రోడ్లు నిర్మిస్తున్నాం**
**రెండవ రోజూ గిరిజన గ్రామాల్లో పవన్ పర్యటన**

**విజయనగరం డిసెంబర్ 21(నిఘా న్యూస్):** ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ భాగస్వామి అయ్యాడంటే.. ప్రతీ గిరిజన యువకుడు ప్రభుత్వంలో వున్నట్టే లెక్క అంటూ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. డోలీ రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఇక్కడ ప్రజల ఆవేదన, బాధ తెలుసుకోవడం కోసమే అటవీ ప్రాంతంలో పర్యటించామన్నారు. రూ.105 కోట్లతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా రోడ్లు నిర్మిస్తున్నామని చెప్పారు. ఎన్నికల కోసమో, ఓట్ల కోసం మా ప్రభుత్వం పనిచేయదని. ప్రజల కష్టాలు, కన్నీళ్లలో మేం వున్నామని ఖచ్చితంగా చెబుతున్నామన్నారు. 19 పనులు ప్రారంభించామని ఆయన తెలిపారు. అల్లూరి జిల్లా అనంతగిరి మండలం గుమ్మంతి పర్యటనలో గిరిజనుల సమస్యను పవన్ కల్యాణ్ అడిగి తెలుసుకున్నారు. 'డోలీ మోతల విముక్త ఏపీ'లో భాగంగా మారుమూల గిరిజన గ్రామాలకు రహదారి నిర్మాణం కోసం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భూమి పూజ చేశారు. గిరిజన యువత తలుచుకుంటేనే మార్పు సాధ్యమని. ప్రభుత్వం మారింది, పంచాయతీ సర్పంచ్‌లు తల ఎత్తుకుని తిరిగే పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా ప్రణాళిక బద్ధంగా పనిచేస్తున్నామన్నారు. 100 మంది జనాభా ఉన్న గ్రామాలకు రోడ్లు నిర్మాణం ప్రధాని నరేంద్ర మోడీ మహా సంకల్పమని వెల్లడిరచారు. ఏటా రూ. 350కోట్లు రహదారులు, ఇతర అవసరాల కోసం కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నమ్మకం గెలుచు కోవడానికి ఇక్కడకు వచ్చాను. ఐదేళ్ల పనితీరు గమనించి ప్రోగ్రెస్ రిపోర్ట్ ఇవ్వాలన్నారు. తాను, ..మిగతా 2లో

### వ్యాపారం చేసుకోండి...
# ప్రాణాలు తీయకండి

**హీరోలను అరెస్టు చేయొద్దని ఏమైనా చట్టాలు ఉన్నాయా?**

- తల్లి చనిపోయిందని చెప్పినా చేతులూపుకుంటూ ర్యాలీ నిర్వహిస్తారా?
- తల్లి చనిపోయి కొడుకు ఆసుపత్రిలో ఉంటే కనీసం పరామర్శించరా?
- నేను అధికారంలో ఉన్నంత వరకు బెన్‌ఫిట్ షోలు ఉండవు
- హీరోలంటే తెరపైన కాదు.. నిజ జీవితంలో చూపాలి
- కనీసం మానవత్వం చూపని సినీ ప్రముఖులు
- పుష్ప 2 ఘటనపై అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి భావోద్వేగం

**హైదరాబాద్ డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కొన్నికొన్ని సంఘటనలు చూస్తే మనసు చలించిపోతుందని, అసలు సమాజం ఎటువైపు పోతుందని బాధేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం జరిగిన అసెంబ్లీలో సమావేశంలో తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అసెంబ్లీ సమావేశంలో భాగంగా పుష్పా-2 సినిమా బెన్‌ఫిట్ షో సందర్భంగా సంధ్య థియేటర్‌లో జరిగిన సంఘటనను గూర్చి సీఎం మాట్లాడారు. పుష్పా-2కు సంబంధించి టిక్కెట ధరలు విషయంలో, బెన్‌ఫిట్ షోకు సంబంధించి ప్రభుత్వమే అనుమతి ఇచ్చిందని సీఎం గుర్తు చేశారు. కానీ బెన్‌ఫిట్ షోకు వస్తే జనం కిక్కిరిసి ఉంటారని, కనీస జ్ఞానం లేకుండా లేకుండా, పోలీసులకు సరైన సమాచారం ఇవ్వకుండా థియేటర్‌కు రావడంతో ఒక మహిళ ..మిగతా 2లో





# పోలీసుల అనుమతితోనే ర్యాలీ

**మహిళ చనిపోయిన విషయం ఆ రోజు తెలియదు**
**నా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసే ప్రయత్నం**
**నాపై ఆరోపణలన్నీ సత్యదూరం**
**థియేటర్ నాకు గుడి లాంటిది**
**అక్కడ ప్రమాదం జరగడం బాధగా ఉంది**
**బాధిత కుటుంబానికి అండగా ఉన్నాం: అల్లు అర్జున్**

2

# పదేళ్ల అధికారంతో వెయ్యేళ్లకు సరిపడా సంపాదన



**తెలంగాణ అభివృద్ధికి బీఆర్ఎస్ మోకాలడ్డు**
**కొడంగల్‌ను అభివృద్ధి చేయడం తప్పా**
**విద్య, వైద్య సౌకర్యాలు వారికి వద్దా**
**బీఆర్ఎస్ తీరుపై నిప్పులు చెరిగిన సీఎం రేవంత్**

**హైదరాబాద్ డిసెంబర్ 21(నిఘా న్యూస్):** అభివృద్ధిని అడ్డుకుం టూ గతంలో తాము చేసిందే అభివృద్ధి అని చెబుతూ అదే ఆదర్శంగా తీసుకోవాలని చెబుతున్న బీఆర్ఎస్ తీరుపై తెలంగాణ అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కొడంగల్ అభివృద్ధికి మోకాలడ్డుతున్న బీఆర్ఎస్ నేతల తీరును దుయ్యబట్టారు. నల్లమల్ల అడవుల్లో జంతువలను తొక్కుకుంటూ వచ్చిన తాను వారిలాగా రాజకీయంగా ఎదగలేదన్నారు. లగచర్ల ఘటనపై అసెంబ్లీలో సీఎం మాట్లాడుతూ 'కొడంగల్ ప్రజలకు నా జీవితాంతం ఏం చేసినా తక్కువే. స్వాతంత్ర్యం వచ్చాక కొడంగల్ నుంచి ఒక్కరూ మంత్రి కాలేదు. నాకు సీఎంగా అవకాశం వచ్చింది. కొడంగల్ నియోజకవర్గంలో చదువుకున్న వాళ్లకు ఉద్యోగ అవకాశాలు ఇవ్వాలని నేను అనుకోవడం తప్పా. ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్‌కు కూతవేటు దూరంలో ఉన్న ముచ్చర్లలో ఫార్మా సిటీ పెట్టడం తప్పు కానప్పుడ, సాగు, త్రాగునీరు లేని చోట భూములు తీసుకుంటే తప్పా అంటూ ప్రశ్నించారు. నాలుగు గ్రామాల్లో భూసేకరణ చేసి కంపెనీలు తేవాలని అనుకున్నా. కోట్ల రూపాయలు పంపించి, మందు ..మిగతా 2లో

### వ్యవసాయమే లేని హైదరాబాదులోనూ
# రైతుబంధు ఇచ్చారు

**రాళ్లు రప్పలు వెంచర్లు, పారిశ్రామిక వేత్తలకు రైతుబంధు ఇవ్వం**
**అర్హులైన భూమి ఉన్న వారికే రైతు భరోసా**
**సంక్రాంతి తరవాత రైతు భరోసా అమలు చేస్తాం**
**బీఆర్ఎస్ హయాంలో 22,600 కోట్లు అనర్హులకు చెల్లింపు**
**అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి**

2

### నల్గొండకు కాళేశ్వరం నీళ్లు...
# ఒక్క ఎకరాకైనా ఇవ్వలేదు

**అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి**
**కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో రెండు లక్షల ఎకరాలకు నీళ్లు**
**బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఎదురుదాడి**
**పరస్పరం ఆరోపణలు గుప్పించుకున్న మంత్రి కోమటిరెడ్డి, హరీష్ రావు**



**హైదరాబాద్ డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** అసెంబ్లీలో కాళేశ్వరం నీళ్లపై జగడం మొదల్కైంది. మాజీ మంత్రి హరీష్ రావుకు మంత్రి కోమటి రెడ్డి సవాల్ విసిరారు. నల్గొండ జిల్లాకు కాళేశ్వం నీరు చేరాయన్నా దానిపై సభలో గందగోళం ఏర్పడిరది. దీంతో మంత్రి కోమటి రెడ్డి సభలో మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో కాళేశ్వరం నీళ్లు ఒక్క ఎకరానికి ఇచ్చినట్లు నిరూపించినా తాను రాజీనామా చేస్తానని మంత్రి అన్నారు. మాజీ మంత్రి హరీశ్ రావు ఏం మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. చర్చకు రావాలని హరీష్ రావు, కేటీఆర్ లకు సవాల్ విసిరిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్గొండకు నీళ్లు ఎవరు ఇచ్చారో అడగాలని ప్రశ్నించారు. నల్గొండ జిల్లాలో ఎకరాకు కాళేశ్వరం నీళ్లు ఇచ్చారని నిరూపిస్తే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు వల్లే ఏఎంఆర్‌బీ వచ్చిందని గుర్తు చేశారు. తన బావ, మామ నల్గొండ ..మిగతా 2లో

# ఉత్తరాంధ్ర వర్షాలపై చంద్రబాబు సమీక్ష

**బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం**
**అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశం**

**అమరావతి డిసెంబర్ 21(నిఘా న్యూస్):** అల్పపీడన ప్రభావంతో ఉత్తరాంధ్రలో కురుస్తున్న భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సహాయక చర్యలకు సన్నద్ధంగా ఉండాలన్నారు. అల్పపీడన వర్షాలపై సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సీఎంవో అధికారులు ఆయా జిల్లాల్లో ప్రస్తుత పరిస్థితులపై ముఖ్యమంత్రికి వివరించారు. కలెక్టర్లు, జిల్లా స్థాయిలో అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. భారీవర్షాలు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడంతో పాటు, స్కూళ్లకు సెలవు ప్రకటించినట్లు సీఎంకు వెల్లడిరచారు. కొన్ని ప్రాంతాల్లో పంటలు దెబ్బ తిన్నాయని, వర్షాల అనంతరం పంటనష్టం వివరాలు సేకరించి రైతులకు సాయం అందేలా చూడాలని సీఎం ఆదేశించారు. భారీవర్షాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు అన్నదాతలకు చేరేలా చూడాలని సూచించారు. అన్ని స్థాయిల్లో అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండి పనిచేయాలని ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. ఇదిలావుంటే పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. గడిచిన 6 గంటలుగా గంటకు 12 కిలోమీటర్ల వేగంతో వాయుగుండం ..మిగతా 2లో





# రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

**ప్రత్యేక విమానంలో ఢిల్లీకి పయనం**

**హైదరాబాద్ డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఐదు రోజుల దక్షిణాది పర్యటన శనివారం ముగిసింది. దీంతో శనివారం ప్రత్యేక విమానంలో ఢిల్లీకి బయలుదేరారు. హకీంపేట ఎయిర్ పోర్ట్ లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, మంత్రి సీతక్క, చీఫ్ సెక్రటరీ శాంతికుమారి, డీజీపీ డాక్టర్ జితేందర్, త్రివిధ దళాల అధికారులు, మేడ్చల్ కలెక్టర్ గౌతమ్, సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి, ..మిగతా 2లో

# పాలమూరును ఎండ బెట్టిన బీఆర్ఎస్

**ఒక్క ఎకరాకు నీరు అందించినా**
**రాజకీయ సన్యాసం: జూపల్లి సవాల్**
**కేటీఆర్ తీరుపై విరుచుకుపడ్డ అధికార ఎమ్మెల్యేలు**

2


# షాపులోకి దూసుకెళ్లిన డీసీఎం నలుగురి మృతి

2

# వరుస దాడుల్లో... భారీగా డ్రగ్స్ పట్టివేత

**కొత్త సంవత్సరం వేళ రాష్ట్ర వ్యాప్తంగా పోలీసుల తనిఖీలు**

**హైదరాబాద్ డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మరికొద్దిరోజుల్లో న్యూఇయర్ రాబోతోండగా హైదరాబాద్‌లో డ్రగ్స్ కలకలం రేపాయి. ఇటీవలి కాలంలో వరుసగా డ్రగ్స్ పట్టివేతలు కలకలం రేపుతున్నాయి. అయితే న్యూఇయరే టార్గెట్‌గా కొందరు డ్రగ్ ఫెడ్లర్‌లు.. న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగానికి ప్రయత్నిస్తుంటారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్ర నుంచి పలు విధాలుగా డ్రగ్స్‌ను నగరానికి ..మిగతా 2లో



# వ్యాపారం చేసుకోండి... ప్రాణాలు తీయకండి

మొదటి పేజీ తరువాయి...

చనిపోవడంతో పాటు ఆమె కుమారుడు అపస్మార స్థితిలో ఉన్నాడని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా కనీసం చలనం కూడా లేకుండా అక్కడ ఉండి సినిమా చూస్తా అనడం దేనికి సంకేతమని రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇంకా అక్కడే ఉంటే మరింత ప్రమాదం జరుగుతుందని సినీహీరో అల్లుఅర్జున్‌కు చెప్పిన పోలీసులు ఇప్పటికే ఒకరు చనిపోయారు, ఒకరి పరిస్థితి ప్రమాదకరంగా ఉందని చెప్పినా కూడా వెళ్లకుండ ఉండటంతో మీరు ఇక్కడే ఉంటే అరెస్టు చేయాల్సి వస్తుందని అనడంతో అప్పుడు వెళ్లిపోయారన్నారు. అది కూడా వెళ్లే సమయంలో ఓపెన్‌టాప్ జీపులో చేతులు బయటకు ఊపుతూ కనీసం ఎవరు చనిపోయారు, ఎవరు గాయాలు పాలయ్యారని చూడకుండా ఉండటం ఎంత వరకు సబబు అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. ఇప్పటికీ ప్రమాదంలో గాయపడిన బాబు పరిస్థితి ఆందోళన కరంగా ఉందని చెప్పారు. సినీ పెద్దలు కానీ, రాజకీయ ప్రముఖులు కానీ వెళ్ల లేదని ఇదా అధ్యక్ష మానవత్వం అంటే అని రేవంత్‌రెడ్డి అన్నారు. ఒక్కరోజు జైలులో ఉన్నందుకు అల్లు అర్జున్‌కు పదుల సంఖ్యలో పరామర్శలు, ప్రభుత్వంపైన విమర్శలు చేస్తున్నారని, అల్లుఅర్జున్ ఏమైనా గాయపడ్డారా, ఏమైనా జరిగిందా అని నిలదీశారు. ఒక్క రోజు జైలులో ఉంటేనే మీకు ఆలా ఉంటే అక్కడ ఒకరి ప్రాణం పోవటంతో, ఏమీ తెలియని చిన్నారి కోమాలోకి వెళ్లితే బాధ కలగదా అని అన్నారు. అల్లుఅర్జున్‌ను కావాలనే ప్రభుత్వం అరెస్టు చేసిందని పదేళ్లు పాలించిన ఒక నాయకుడు ట్విటర్‌లో ఇష్టం వచ్చినట్లు కామెంట్లు పెడుతున్నారని, సమాజం ఎటువైపు పోతుందని ఆయనకు కనీస మానవత్వం లేదా అని ప్రశ్నించారు. అదే మన ఇంట్లో ఇలాంటి ఘటన జరిగితే మనం ఊరుకుంటామా అని అన్నారు. మరీ అలాంటప్పుడు సినీ హీరోలను అరెస్టు చేయవద్దని ఏమైనా చట్టాలు ఉన్నాయా, లేకపోతే చేయండి అధ్యక్షా.. అలాంటి చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఒకింత అసహనానికి లోనయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చేసిన చట్టం ప్రకారం పోలీసులు నడుచుకుంటారని వారు రాజకీయ నాయకులా.. సినీ హీరోలా అని చూడరని అన్నారు. నిజం హీరోలందరి తెరపైన కాదు. నిజజీవితంలో ఎలా ఉండాలో చూపిస్తే వారిని ప్రేమిస్తే అభిమానులకు మేలు జరుగుతుందని ఆయన హితవు పలికారు. ఇప్పటికైనా అర్థంపర్థంలేని కామెంట్లు చేయకుండా కనీస మానవత్వాన్ని చాటుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.

**ఇలాంటి ఘటనలను ఎవరూ హర్షించరు: అక్బరుద్దీన్**

సంధ్య థియేటర్‌లో జరిగిన ఘటనను మానవత్వం ఉన్న ఎవరూ హర్షించరని, దానికి బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు. మనకు పిల్లలు ఉన్నారని, ఇలాంటి ఘటనను తీవ్రంగా వ్యతిరేకించాల్సిందేనని అన్నారు. ఘటనలో తీవ్రంగా గాయపడిన బాలుడు త్వరగా కోలుకోవాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు చెప్పారు. సినీ ప్రముఖులు కూడా ఆ బాలుడిని పరామర్శించకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇంకా ఘటనకు బాధ్యుల్కైన వారికే సానుభూతి పలకడం ఎంత వరకు సబబని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంలో ఎటువంటి సందేహాలు అవసరం లేదని బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## పోలీసుల అనుమతితోనే ర్యాలీ

థియేటర్ తనకు గుడిలాంటిదని, అక్కడ ప్రమాదం జరగడం నిజంగా బాధాకా ఉందని సినీ నటుడు అల్లు అర్జున్ అన్నారు. పోలీసులు, అధికారులు అందరూ కష్టపడి పనిచేసినా, సంధ్య థియేటర్ వద్ద జరిగిన ఘటన దురదృష్టకరమని విచారం వ్యక్తం చేశారు. అయితే ఈఘటనతో కుంగిపోయా, బాధిత కుటుంబానికి అండగా నిలిచినా.. తన వ్యక్తిత్వంపై దాడి జరిగిందని, అసత్య ప్రచారాలు సాగుతున్నాయని బాధ వ్యక్తం చేశారు. సీఎం అసెంబ్లీలో ప్రకటన చేసిన అనంతరం అల్లు అర్జున్ వివరణ ఇచ్చుకునే ప్రయత్నం చేశారు. బాధిత కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్లు తెలిపారు. అయితే తనపై చేసిన ఆరోపణలన్నీ నిరాధారమైనవని తెలిపారు. సీఎం వ్యాఖ్యల నేపథ్యంలో అల్లు అర్జున్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. తన వ్యవహారశైలిపై వచ్చిన వార్తలను అల్లు అర్జున్ ఖండించారు. తన క్యారెక్టర్‌ను తక్కువ చేసే ప్రయత్నం జరుగుతోందన్నారు.'నాపై చేసినవన్నీ తప్పుడు ఆరోపణలే. నేను ఎలాంటి ర్యాలీ చేయలేదు. థియేటర్‌కు కొద్ది దూరంలో నా కారు ఆగిపోయింది. కారు ముందుకు కదల్లేదు. చేయి చూపిస్తూ ముందుకు కదలండని పోలీసులు అంటేనే నేను బయటకు వచ్చి, చేతులు ఊపాను. థియేటర్ లోపలికి వచ్చిన తర్వాత ఏ పోలీస్ లోపలికి వచ్చి జరిగిన సంఘటన గురించి చెప్పలేదు. థియేటర్ యాజమాన్యం వచ్చి, జనాలు ఎక్కువగా ఉన్నారని చెబితే, బయటకు వచ్చేశాను. తొక్కిసలాటలో మహిళ చనిపోయిన విషయం మరుసటి రోజు వరకు తెలియదన్నారు. మహిళ చనిపోయిన ఘటన తెలిసి కూడా ఎలా వెళ్లిపోతాను? నాకూ పిల్లలు ఉన్నారు కదా. మరుసటి రోజు విషయం తెలిసిన తర్వాత బన్నీ వాసుకు ఫోన్ చేసి, ఆస్పత్రికి వెళ్లమని చెప్పాను. నేను కూడా బయలుదేరదామని సిద్ధమయ్యా. కానీ, నాపై కేసు నమోదు చేశారని బన్నీ వాసు చెప్పాడు. నా లీగల్ టీమ్ కూడా వద్దని వారించింది. అందుకే నేను ఆస్పత్రికి వెళ్లలేదని అన్నారు. గతంలో పలువురి హీరోల అభిమానులు చనిపోతే పరామర్శించడానికి వెళ్లాను. నా సొంత అభిమానులు చనిపోతే, వెళ్లి కలవనా? జరిగిన ఘటన విషయం తెలిసి షాక్‌లో ఉన్నా. అందుకే ఆలస్యంగా వీడియో పెట్టా. డబ్బులు అనేది ఇక్కడ విషయమే కాదు. చాలా ఈవెంట్లు పెట్టాలని అనుకున్నాం. ఈ ఘటన తర్వాత అన్నింటినీ రద్దు చేశాం. ఆ కుటుంబాన్ని పరామర్శించడానికి స్పెషల్ అనుమతి తీసుకుని, మా నాన్నను వెళ్లమని చెప్పాను. అదీ కుదరదని అన్నారు. కుదిరితే సుకుమార్‌గారిని వెళ్లమని చెప్పారు. అదీ కాదన్నారు. నేను ఆ కుటుంబాన్ని పట్టించుకోవడం లేదని అందరూ ఆరోపిస్తున్నారు. కానీ, నా క్యారెక్టర్‌ను చాలా తక్కువ చేసి మాట్లాడుతున్నారు. ఇది మాత్రం మనసుకు తీసుకోలేకపోతున్నా. మీరు థియేటర్‌కు వచ్చి ఎంజాయ్ చేయాలని నేను సినిమాలు చేస్తున్నా. ఈ ఘటన విషయంలో బాధిత కుటుంబాన్ని ఆదుకోవడానికి పెద్ద అమౌంట్ ఫిక్స్‌డ్ చేయాలని అనుకున్నాం. అవసరమైతే ఫిజియో థెరపీ చేయించాలని అనుకున్నాం. తెలుగువారు గర్వపడేలా సినిమా చేశానని అనుకుంటుంటే, మనల్ని మనం కిందకు లాక్కుంటున్నాం' 'నేనెవరినీ నిందించడానికి ఈ ప్రెస్ మీట్ పెట్టలేదు. మా సినిమాకు ప్రభుత్వం అన్ని రకాలుగా సపోర్ట్ చేసింది. అందుకు ధన్యవాదాలు. కానీ, నాపై తప్పుడు సమాచారం ప్రచారం చేస్తున్నారు. నా వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారు. 22 ఏళ్లుగా కష్టపడి సాధించిన నమ్మకం, గౌరవం ఒక రాత్రిలో పోగొట్టారు. అందుకు బాధగా ఉంది. అంతేగానీ, నాకు ఎవరిపైనా వ్యక్తిగతంగా కోపాలు లేవు. నాకు మానవత్వం లేదనడం సరికాదు. మళ్లీ మళ్లీ చెబుతున్నా, నా వ్యక్తిత్వంపై చేసిన ఆరోపణలన్నీ 100 శాతం అబద్ధం. ప్రస్తుతం న్యాయపరమైన చిక్కులు ఉన్నందున మీ ప్రశ్నలన్నింటికీ త్వరలోనే సమాధానం చెబుతా' అని అల్లు అర్జున్ అన్నారు.

## సర్పంచ్‌లు తలెత్తుకుని తిరిగేలా అభివృద్ధి పనులు

మొదటి పేజీ తరువాయి...

ముఖ్యమంత్రి మనసు పెట్టకపోతే ఇవాళ ఏజెన్సీలో రోడ్లు లేవన్నారు. ఫైనాన్స్ ఎలా హ్యాండిల్ చెయ్యాలో తెలియదు. ప్రజల ఇబ్బందులను తెలుసుకోవడం వారిని పరిష్కరించడం మాత్రం తెలుసన్నారు. జనవరిలో రూ.250 కోట్లు రహదారుల నిర్మాణం కోసం కేంద్రం నిధులు ఇవ్వనుందని తెలిపారు. తిట్లు తిన్నాం. కుటుంబ సభ్యులను టార్గెట్ చేసినా భరించి నిలబడ్డాం. దాని ఫలితం ఇవాళ ప్రజలకు సేవ చేసే అవకాశం లభించిందన్నారు. గంజాయిని ఒక సామాజిక సమస్యగా చూడాలని పవన్ అన్నారు. గంజాయి గిరిజన ఆచార వ్యవహారాలు దాటి కమర్షియల్ అయిందన్నారు. యువత, పిల్లలు చెడి పోవడానికి గంజాయి కారణమంటూ వ్యాఖ్యానించారు. మత్తులో ఇటీవల కడపలో టీచర్ పై దాడి చేసి కొందరు విద్యార్థులు దారుణంగా ప్రవర్తించారని ప్రత్యామ్నాయ మార్గాలు కల్పిస్తామన్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. గంజాయి సాగు వదిలేయాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. గంజాయి గ్రామాలను దాటి ఎక్స్‌పోర్ట్ వరకు వెళ్లడంతో ఏపీ కుటుంబ కేబినెట్‌గా మారిందని మండిపడ్డారు. గంజాయిని మీరు వదిలే వరకు మిమ్మల్ని వదలనన్నారు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్. తనకు గిరిజన ఆచార వ్యవహారాలు చాలా ఇష్టమని పేర్కొన్నారు. మీ ఇంట్లో ఒక వ్యక్తి ప్రభుత్వంలో ఉన్నాడని గుర్తు పెట్టుకోవాలన్న ఆయన.. మంచి పని చేసే వాడికి అపద ఉండదు, ఉండకూడదు. దీనిని తాను బలంగా నమ్ముతున్నానన్నారు. సినిమా కోసం తాను ఎప్పుడూ కల కనలేదని, దేశం కోసం, ప్రజల కోసం కలలు కన్నానన్నారు. మనసు, బుద్ధి కలిస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. సినిమా షూటింగ్‌లు ఇక్కడికి రావాలని, విదేశాలలో ఉండే చాలా సుందరమైన ప్రదేశాలు ఇక్కడ ఉన్నాయన్నారు. ఇటువంటి చోట షూటింగ్‌లు చేస్తే స్థానిక గిరిజనులకు ఉపాధి లభిస్తుందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.

## షాపులోకి దూసుకెళ్లిన డీసీఎం: నలుగురి మృతి

నల్లగొండ డిసెంబర్ 21(నిఘా న్యూస్): నల్లగొండ జిల్లా దేవరకొండలో రోడ్డు ప్రమాదం జరిగింది. శనివారం తెల్లవారు జామున దేవరకొండ శివార్లలోని పెద్ద దర్గా వద్ద వేగంగా దూసుకొచ్చిన డీసీఎం అదుపుతప్పి స్వీట్ షాప్‌లోకి దూసుకెళ్లింది. దీంతో నలుగురు అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతులను అబ్దుల్ ఖాదర్, హాజీ, నబీనగా గుర్తించారు. అతివేగం, డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణంగా తెలుస్తున్నది. కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**సత్యసాయి జిల్లాలో**

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీ సత్యసాయి జిల్లాలో శనివారం తెల్లవారు జామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే నలుగురు ప్రాణాలు కోల్పోగా, మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే, గుడిబండ, అమరాపురం మండలాలకు చెందిన 14 మంది మినీ వ్యాన్‌లో ఇటీవలే తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లారు. మళ్లీ తమ స్వగ్రామాలకు తిరిగి వస్తున్న క్రమంలో శనివారం తెల్లవారు జామున మడకశిర మండలం బుళ్లసముద్రం వద్ద ఆగి ఉన్న లారీని వారి వాహనం ఢీకొట్టింది. దీంతో మినీ వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 14 మందిలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో 10 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రులను బెంగళూరులోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. మృతుల నివాసాల్లో విషాదఛా యలు అలుముకున్నాయి. క్షతగాత్రుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. క్షతగాత్రుల్లో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

## పదేళ్ల అధికారంతో... వెయ్యేళ్లకు సరిపడా సంపాదన

మొదటి పేజీ తరువాయి...

తాగించి దాడులు చేయించారు. అధికారులు వెళ్తే రాళ్లు, రప్పలతో దాడులు చేయించారు. కొడంగల్‌లో కంపెనీలు పెట్టొద్దా, ఉద్యోగాలు ఇవ్వవద్దా, మెడికల్ చదువులు వద్దా. అని ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడితే తొక్కుకుంటూ పోతా అని అందుకే అంటున్నా. అన్నీ వద్దు అన్నాక అభివృద్ధి పథంలో నడిపించడం ఎట్లా సాధ్యం అవుతుంది. దొంగలకు సద్దులు మోస్తున్నారు. నల్లమల అడవుల నుంచి కూరమృగాల మధ్య నుంచి వచ్చాను. గుంటూరు విజ్ఞాన్‌లో చదువుకుని రాలేదు. సామాన్యుడిగా వచ్చాను. అయ్య పేరు చెప్పుకుని రాలేదు. ఎమ్మెల్యేలను ఒత్తిడి చేసి సియోల్‌కు బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను పంపించలేదు. కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డం పడుతున్నారు' అంటూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి విషయంలో అడ్డుపడితే తెలంగాణ సమాజం క్షమించదన్నారు. గత పదేళ్ల విధ్వంసం గురించి తెలంగాణ సమాజం తెలుసుకోవాలని అన్నారు. ఇచ్చిన మాటలకు కట్టుబడి సోనియా తెలంగాణ ఇస్తే పదేళ్లపాటు అధికారం చెలాయించి వెయ్యేళ్లకు సరిపడా సంపాదించు కున్నారని అన్నారు.

## వరుస దాడుల్లో... భారీగా డ్రగ్స్ పట్టివేత

మొదటి పేజీ తరువాయి...

తీసుకువచ్చేందుకు యత్నించారు. అయితే వారి చర్యలను పోలీసులు ఎప్పటికప్పుడు భగ్నం చేస్తూ వచ్చారు. డ్రగ్స్ సరఫరాపై గత కొద్దిరోజులుగా నిఘా పెట్టిన పోలీసులు. పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న వారిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. డ్రగ్స్‌తో పాటు గంజాయి, హెరాయిన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఇదిలా ఉండగా, న్యూఇయర్ వేడుకల్లో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. ఈ అంశంపై నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా డ్రగ్స్‌పై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామన్నారు. కొత్త సంవత్సరాన్ని ఎంతో ఘనంగా ఆహ్వానించేందుకు ఎన్నో ఈవెంట్లు చేస్తుంటారు. న్యూఇయర్ వేడుకలను ఎంతో గ్రాండ్‌గా నిర్వహిస్తుంటారు. పెద్ద పెద్ద ఈవెంట్లను ఏర్పాటు చేస్తుంటారు.లోకల్ పోలీసులతో కోఆర్డినేట్ చేసుకుంటూ ముమ్మర తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. గత 15 రోజుల్లో నాలుగున్నర కోట్ల డ్రగ్స్‌ను పట్టుకున్నామని 266 డాగ్స్‌తో రాష్ట్ర వ్యాప్తంగా తనిఖీలు చేశామని చెప్పారు. 100 మీటర్ల దూరంలో ఓ ఇంటిపై పెంచుతున్న గంజాయి మొక్కలను కూడా డాగ్స్ గుర్తించాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి డ్రగ్స్‌ను మన రాష్ట్రంలోకి రావడానికి ముందే అడ్డుకోగలుగుతున్నామని తెలిపారు. గత 15 రోజుల కాలంలో 641 కిలోల గంజాయి, 15 కిలోల గంజాయి చాక్లెట్లు, 1600 గ్రాముల హాష్ ఆయిల్, 1383 గ్రాముల ఎండిఎంఎ, 1000 గ్రాముల ఓపీఎం చరాస్, 53 గ్రాముల పాపిస్ట్ర ను పట్టుకున్నామని తెలిపారు. 44 గ్రాముల హెరాయిన్‌తో పాటు 148 కేసులను రిజిస్టర్ చేసి 315 మంది నేరస్తులను అరెస్ట్ చేశామని చెప్పారు. అలాగే ఈవెంట్ ఆర్గనైజర్లు డీజే ప్లేయర్ల ట్రాక్ రికార్డు చెక్ చేసుకోవాలన్నారు. ఈవెంట్లలో డ్రగ్స్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నార్కోటిక్ బ్యూరో ఎస్పీ సాయి చైతన్య హెచ్చరించారు. మరోవైపు సంగారెడ్డి జిల్లాలో భారీగా నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. దీనిపై సంగారెడ్డి జిల్లా ఎస్పీ రూపేష్ మీడియాతో మాట్లాడుతూ టీజీఎన్ఏబీ, సంగారెడ్డి పోలీసుల జాయింట్ ఆపరేషన్ నిర్వహించారని.. సుమారు 70 లక్షల విలువచేసే నిషేధిత ఎండీఎంఏ డ్రగ్స్‌ను పట్టుకున్నారని తెలిపారు. మహమ్మద్ సలీం, ముఖేష్ దుబే అనే ఇద్దరు డ్రగ్ ఫెడ్లర్స్‌ను అరెస్ట్ చేశారన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కస్టమర్లకు డ్రగ్స్ సప్లై చేయడానికి నిందితులు వచ్చారని, షేక్ అమీర్ అనే వ్యక్తికి 1000 గ్రాముల డ్రగ్స్‌ను అమ్మేందుకు ప్రయత్నం చేశారన్నారు. పక్కా సమాచారంతో ఇస్నాపూర్ వద్ద నిందితులను అరెస్టు చేశామన్నారు.

# వ్యవసాయమే లేని హైదరాబాదులోనూ రైతుబంధు ఇచ్చారు

హైదరాబాద్ డిసెంబర్ 21(నిఘా న్యూస్): రైతులకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. గతంలో మాదిరిగా కాకుండా అర్హుల్కైన రైతులందరికీ భరోసా కల్పిస్తామని ప్రకటించారు. రైతు భరోసా అమలు విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానాలు వద్దన్నారు. రైతు భరోసా అంశంపై అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రైతులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంతో ప్రేమ ఉందన్నారు. భూమి చుట్టూనే రైతు జీవితం, వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయన్నారు. భూమినే నమ్ముకుని భూమినే అమ్మగా భావించి జీవనాధారం సాగిస్తున్నారన్నారు సీఎం రేవంత్ రెడ్డి. పెట్టుబడి సాయం కింద రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతోనే రైతు భరోసా తెస్తున్నామన్నారు. గత ప్రభుత్వం బీఆర్ఎస్ పార్టీ హయాంలో సాగులో లేని భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, రాళ్లు, రప్పలు, జాతీయ రహదారుల కింద పోయిన భూములు పరిశ్రమల్లోని భూములు ఇలాంటి వాటన్నింటికీ రైతు బంధు కింద అనర్హులకు కూడా డబ్బులు ఇచ్చారన్నారు. కేసీఆర్ హయాంలో 72 వేల కోట్లు రైతు బంధు కింద చెల్లిస్తే అందులో 22 వేల 606 కోట్ల రూపాయలు అనర్హులకే చెల్లించారన్నారు. ఈ 22 వేల 606 కోట్ల రూపాయలు బీఆర్ఎస్ పార్టీ నేతలు దోచుకున్నారన్నారు. ఇలాంటి తప్పిదాలు అన్నింటినీ సవరించి కొత్త విధానాలు రూపొందించి, అర్హులకే రైతు బంధు సాయం అందించే విధంగా ప్రణాళిక రచిస్తున్నామన్నారు. సంక్రాంతి పండుగ తర్వాత 2025 జనవరి నెలలో కొత్త విధివిధానాలతో రైతు బంధు నిధులు విడుదల చేస్తామన్నారు. నిజమైన రైతులకు న్యాయం జరిగే విధంగా చూస్తామన్నారు. హైదరాబాద్ లో అసలు వ్యవసాయమే లేదని, ఇలాంటి హైదరాబాద్ సిటీలోనూ రైతు బంధు కింద డబ్బులు దోచుకుని తిన్నారంటూ సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రైతులను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు.రైతు భరోసాపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు.'రైతు సమాజాన్ని ఆదుకునేందుకు మా ప్రభుత్వం ముందు ఉంటుంది. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ.22,600 కోట్ల ఆయాచిత లబ్ధి చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు. గత ప్రభుత్వం రైతు బంధు అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రైతులకు పెట్టుబడి సాయం ఇచ్చేందుకు ఈ పథకాన్ని తెచ్చారు. సాగులో లేని భూములకూ రైతుబంధు ఇచ్చారు. దీని ద్వారా రూ.22,600 కోట్ల ఆయాచిత లబ్ధి చేకూర్చారు. రియల్ ఎస్టేట్, పారిశ్రామికవేత్తలకూ ఇచ్చారు. రాళ్లకు, గుట్టలకూ రైతుబంధు ఇద్దామా అని సీఎం రేవంత్ ప్రశ్నించారు. రైతు భరోసా అమలు చేయడానికి సభ్యులంతా సలహాలు ఇవ్వాలని సీఎం కోరారు. జమీందార్లు, భూస్వాములకు రైతు బంధు ఇవ్వాలా, మీరు ఇచ్చారు కాబట్టి మమ్మల్నీ రాళ్లు, గుట్టలకు రైతు బంధు ఇవ్వాలంటున్నారు. భారాసను ఆదర్శంగా తీసుకోవాలని అంటున్నారు. వారిని ఆదర్శంగా తీసుకుంటే మేం కూడా ప్రతిపక్షంలోనే ఉండేవాళ్లం. 2023లో అధికారం.. 2024లో డిపాజిట్లు కోల్పోయిన మీరు మాకు ఆదర్శం కాదు. నిజమైన లబ్దిదారులెవరికీ అన్యాయం జరగకూడదు' అని సీఎం అన్నారు.'రైతుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర తొలి స్థానంలో ఉంది. తెలంగాణ రెండో స్థానంలో ఉంది. భారాస పాలనలో 3 వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో రైతుల ఆత్మహత్యలు తగ్గించామని చెబుతున్నారు. అబద్ధాలు చెప్పే సంఘానికి అధ్యక్షుడు అసెంబ్లీకి రాలేదు. ఆ సంఘానికి ఉపాధ్యక్షుడు అసెంబ్లీకి వచ్చారు' అని సీఎం ఎద్దేవా చేశారు. రైతు భరోసా పథకంపై వివిధ అంశాలను ఆయన వెల్లడిరచారు. రైతు భరోసా పై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని, ఇందిరాగాంధీకి ఉన్న చరిత్ర అందరికీ తెలుసునని అన్నారు. రైతు బందు ఉద్దేశం వ్యవసాయ పెట్టుబడికి సహాయం చేయడమని ఆయన అన్నారు. గత ప్రభుత్వం రైతు బంధు పథకం కింద రూ. 72 వేల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు. అయితే, ఈ పథకంలో అనేక అవకతవకలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, కేసీఆర్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం కొనసాగించారు. కేసీఆర్ అనుభవం, నాయకత్వాన్ని మేము అంగీకరిస్తున్నాం. కానీ, కొన్ని ముఖ్యమైన అంశాలను తెలుసుకోవాలని, కేవలం గొప్పగా మాట్లాడటం కాదు, పేద రైతు వరకు ప్రభుత్వ పథకాలు అందించాలని ఆయన అన్నారు. రేవంత్ రెడ్డి తన నాయకత్వంలో రైతుల రుణమాఫీ చేయడం విధానాన్ని తెలిపారు.



## అరబిక్ భాషలో రామాయణం భారతం

న్యూఢిల్లీ డిసెంబర్ 21 (నిఘా న్యూస్): భారతీయ ఇతిహాస గ్రంథాలు రామాయణం, మహాభారతం పుస్తకాలను అరబిష్ భాషలో తర్జుమా చేశారు. ఆ ట్రాన్స్‌లేట్ చేసిన పుస్తకాలను కువైట్‌లో ఇవాళ ప్రచురణకర్తలు ప్రదర్శించారు. ప్రధాని మోదీ కువైట్‌లో పర్యటిస్తున్న నేపథ్యంలో ఆ రెండు బుక్స్‌ను పబ్లిషర్స్ మీడియాకు ప్రజెంట్ చేశారు. రామాయణం, మహాభారత గ్రంధాలను అరబిక్ భాషలో రాసేందుకు రెండు ఏళ్లు పట్టినట్లు బుక్ పబ్లిషర్స్ పేర్కొన్నారు. రెండు పుస్తకాల నుంచి భారతీయ సంస్కృతిని అర్థం చేసుకున్నట్లు ట్రాన్స్‌లేటర్ తెలిపారు. పశ్చిమాసియా దేశమైన కువైట్ లో ఇంత మంది భారతీయులను చూడటం చాలా ఆనందంగా ఉందని, ఇదో 'మినీ ఇండియా' లా కనిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. రెండు రోజుల కువైట్ పర్యటనకు వెళ్లిన ప్రధాని.. అక్కడి ప్రవాస భారతీయులతో నిర్వహించిన 'హలా మోదీ' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మీ అందరికీ భారత్ నుంచి ఇక్కడికి రావడానికి 4 గంటల సమయం పడితే.. ఓ భారత ప్రధాని ఇక్కడికి రావడానికి 4 దశాబ్దాల సమయం పట్టిందన్నారు. ప్రతి ఏటా వందలాది మంది భారతీయులు ఇక్కడికి వస్తున్నారని, అలా కువైట్ సమాజానికి భారతీయతను పరిచయం చేశారని మోదీ అన్నారు. భారతదేశ ప్రతిభ, సాంకేతికత, సంప్రదాయాలను మేళవించి కువైట్ నేలను భారతీయ నైపుణ్య రంగులతో నింపారని ప్రశంసించారు. ఈ దేశ వైద్యరంగానికి భారతీయ వైద్యులు, పారామెడికోలే ప్రధాన బలమన్నారు. 'కువైట్ భవిష్యత్ తరాలను తీర్చిదిద్దడంలో భారతీయ ఉపాధ్యాయుల పాత్ర కీలకంగా మారింది. ఈ దేశ నేతలతో ఎప్పుడు మాట్లాడినా భారతీయుల గురించి ప్రశంసిస్తూనే ఉంటారు. రెమిటెన్స్‌లను (విదేశీ కరెన్సీ) స్వీకరించడంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా ఉంది. మీరంతా కష్టపడి పని చేయడం వల్లే ఈ ఘనత సాధ్యమైంది. భారత్, కువైట్ దేశాలు అరేబియా సముద్రానికి ఇరువైపులా ఉన్నాయి. ఈ రెండు దేశాలను కేవలం దౌత్యసంబంధాలే కలపడం లేదు. హృదయ సంబంధాలు కూడా దగ్గర చేస్తున్నాయి. ఇప్పుడే కాదు.. గతంలోనూ రెండు దేశాల మధ్య సంబంధాలు బాగుండేవి. కువైట్‌కు అవసరమైన మానవ వనరులు, నైపుణ్యత, సాంకేతికతను అందించడం లో భారత్ ముందంజలో ఉంది. రాబోయే కాలంలో ఈ రెండు దేశాలు కేవలం వాణిజ్యపరంగానే కాకుండా పరస్పర శ్రేయస్సు కోరుకునే భాగస్వాములు కూడా అవుతాయి. భారతదేశంలోని స్టార్టప్‌లు, సాంకేతిక కువైట్ అవసరాలకు అత్యాధునిక పరిష్కారాలను చూపించగలవు' అని మోదీ అన్నారు. కొవిడ్ -19 మహమ్మారి సమయంలో భారత్‌కు లిక్విడ్ ఆక్సిజన్‌ను సరఫరా చేసిన కువైట్ ప్రభుత్వానికి ఈ సందర్భంగా మోదీ కృతజ్ఞతలు తెలిపారు.

## ఉత్తరాంధ్ర వర్షాలపై చంద్రబాబు సమీక్ష

మొదటి పేజీ తరువాయి...

కదులుతోంది. ప్రస్తుతం విశాఖకు అగ్నేయంగా 430 కిలోమీటర్లు దూరంలో కేంద్రకృతమై ఉంది. చెన్నైకు ఈశాన్యంగా 480 కిలోమీటర్లు, గోపాల్‌పూర్‌కు దక్షిణంగా 590 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని వాతావరణశాఖ తెలిపింది. రాగల 12 గంటలపాటు ఇది తూర్పు ఈశాన్యం దిశగా కదులుతూ వాయుగుండంగా కొనసాగే అవకాశం ఉంది. ఆ తదుపరి క్రమంగా సముద్రంలోనే బలహీన పడే సూచనలు ఉన్నట్లు పేర్కొంది. దీని ప్రభావంతో రాగల 24 గంటల్లో ఉత్తర కోస్తా, దక్షిణ కోస్తాంధ్ర రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరుగా వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని పేర్కొంది.

## రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

మొదటి పేజీ తరువాయి...

ఉన్నతాధికారులు రాష్ట్రపతికి వీడ్కోలు పలికారు. ఐదురోజుల పర్యటనలో భాగంగా సికింద్రాబాద్ లోని కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్ మెంట్ కు కలర్స్ ప్రజెంటేషన్ అవార్డు అందజేశారు. ఈ నెల 29 నుంచి 15 రోజులపాటు నిర్వహించే ఉద్యాన్ ఉత్సవ్ కు సంబంధించిన సౌకర్యాలపై బొల్లారంలోని నిలయంలో సమీక్ష నిర్వహించారు. అలాగే ఏపీలోని మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవానికి కూడా హాజరయ్యారు. శుక్రవారం రాత్రి నిలయంలో ఎట్ హోం కార్యక్రమంలో భాగంగా గవర్నర్, సీఎం, మంత్రులు, ప్రముఖులకు తేనీటి విందు ఏర్పాటు చేశారు. శీతాకాల విడిది కోసం రాష్ట్రపతి ఏటా డిసెంబర్, జనవరి మధ్య నిలయానికి వచ్చి.. ఇక్కడి నుంచే అధికారిక కార్యకలాపాలు నిర్వహిస్తారు.

## నల్గొండకు కాళేశ్వరం నీళ్లు ఒక్క ఎకరాకైనా ఇవ్వలేదు

మొదటి పేజీ తరువాయి...

ప్రజలను చంపేస్తారా వాళ్ళని చంపేయండి అని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి మూసీని సరిచేస్తున్నారన్నారు. అందుకు కూడా తన బావ, మామ అడ్డుపడుతున్నారని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. 24గంటల కరెంట్ ఇవ్వలేదని లాగ్ బుక్స్ తెచ్చి చూపిస్తా అన్నారు. ఎక్సైజ్ టెండర్లు ఒక ఏడాది ముందు పెట్టారు. రూ.2 వేల కోట్లు ముందుగా వసూలు చేశారన్నారు. కేటీఆర్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వంలో కేవలం 14 గంటల కరెంటు మాత్రమే ఇచ్చారన్నారు. నేను సబ్ స్టేషన్ వెళ్లి చెక్ చేశానని తెలిపారు. నేను ఎమ్మెల్యే, ఎంపీగా గత పదేళ్లుగా పని చేశానని సభలో తెలిపారు. కేసీఆర్ పాలనలో 24 గంటల కరెంటు ఇవ్వలేదన్నారు. ఎక్సైజ్ టెండర్లు 2లక్షలు పెట్టి రూ.2వేల కోట్లు వసూళ్లు చేశారు. ఆ డబ్బులు ఎక్కడికి వెళ్ళాయో తెలీదన్నారు. తెలంగాణ వచ్చాక నష్టపోయిన జిల్లా నల్గొండ అని తెలిపారు. తెలంగాణ వస్తే దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా అన్నారు. కేసీఆర్ మాట తప్పారని తెలిపారు. హామీల గురించి, మేనిఫెస్టోల గురించి బీఆర్ఎస్ మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో వందేళ్లు వెనక్కి తీసుకెళ్ళారని కీలక వ్యాఖ్యలు చేశారు. కూలిపోయే ప్రాజెక్టులు మాత్రమే కట్టారన్నారు. ఇంటింటికి నీళ్లు ఇయ్యకపోతే ఓట్లు అడుగ అన్నావ్ అన్నారు. సిరిసిల్లకు పోదాం ఏ ఇంటికి నీళ్లు వస్తున్నాయో తెలుస్తుందన్నారు. నల్గొండ జిల్లా సూర్యాపేటకు వెళ్దాం అన్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు కట్టింది ఎవరని ప్రశ్నించారు. బావ,బామ్మర్దికి నల్గొండ జిల్లాపై కోపం ఎందుకని మండిపడ్డారు. మాకు విషం ఇచ్చి చంపండని మంత్రి తెలిపారు. ఉచిత విద్యుత్ అందించింది కాంగ్రెస్. దాని పేటెంట్ హక్కు కాంగ్రెస్‌దే. భారాస పాలనలో నీళ్లు, విద్యుత్ ఏమీ ఇవ్వలేదు. వాళ్ల పాలనలో కూలిపోయే ప్రాజెక్టులు కట్టారు. మిషన్ భగీరథ ద్వారా కుళాయి నీళ్లు వచ్చాయని ప్రజలు చెబితే, మరో సారి ఓట్లు అడగం. మిషన్ భగీరథలో రూ.50 వేలకోట్లు తినేశారు' అని కోమటిరెడ్డి ఆరోపించారు. అయితే మంత్రి ఆరోపణలను భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు ఖండిరచారు. 'మిషన్ భగీరథకు అయిన ఖర్చు రూ.28 వేల కోట్లు. రూ.50 వేల కోట్లు తిన్నారని మంత్రి కోమటిరెడ్డి ఎలా మాట్లాడతారు. మంత్రి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలి. కాళేశ్వరం ద్వారా నల్గొండ జిల్లాలో 2 లక్షల ఎకరాలకు నీళ్లు అందించాం. నల్గొండలో వైద్య కళాశాల పెట్టింది కేసీఆర్. ఉమ్మడి నల్గొండలో యాదాద్రి పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశాం' అని హరీశ్ రావు అన్నారు.

## పాలమూరును ఎండ బెట్టిన బీఆర్ఎస్

హైదరాబాద్ డిసెంబర్ 21(నిఘా న్యూస్): పాలమూరు ప్రాజెక్టులపై గత బీఆర్ఎస్ అబద్దాలు చెబుతోందని, ఒక్కరాకు నీరందించినట్లు నిరూపించినా రాజకీయ సన్యాసం తీసుకుంటానని మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. అబద్దాలు చెప్పడంలో బీఆర్ఎస్ నేతలు ఆరితేరారరని మండిపడ్డారు. నిజాలు చెప్పడానికి ధైర్యం కావాలన్నారు. పాలమూరును ఎండబెట్టి ఇవ్వాళ్ల నీతులు చెబుతున్నారని అన్నారు. దమ్ముంటే నిరూపిస్తే తాను రాజీనామా చేస్తానని అన్నారు. రైతులను మోసం చేసి వారి గురించి మాట్లాడుతున్నారని అదికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కూడా కేటీఆర్ లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వలేమని చెప్పిన కేసీఆర్ ఇప్పుడు వారి గురించి కేటీఆర్ కన్నీరు ఒలక బోస్తున్నారుని పెద్దపల్లి ఎమ్మెల్యే మండిపడ్డారు.కౌలురైతుల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. మరో ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ కాళేశ్వరం పేరుతో కరీంనగర్‌కు చుక్కనీరు రాలేదన్నారు. కాళేశ్వరం పేరుతో అడ్డంగా దోచుకున్నారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు గతంలో కట్టిన ప్రాజెక్టులే శరణ్యమయ్యాయని అన్నారు. అంతకుముందు రైతుభరోసాపై కేటీఆర్ మాట్లాడగా పలువురు సభ్యులు తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనపై మండిపడ్డారు. సాగు విస్తీర్ణం పెరగాలనే ఉద్దేశంతోనే రైతుబంధు ఇచ్చామని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ '201920లో సాగు విస్తీర్ణం 141 లక్షల ఎకరాలుంది. 2020-21లో సాగు విస్తీర్ణం 204 లక్షల ఎకరాలని నివేదికలో చెప్పారు. రైతుబంధు ఇవ్వడం వల్లే సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. ఇదే విషయాన్ని ప్రభుత్వం ఇచ్చిన నోట్ స్పష్టం చేస్తోంది. 4.50 లక్షల మంది గిరిజనులకు పోడు పట్టాలు ఇచ్చాం. పోడు పట్టాలున్న గిరిజనులకు రైతుబంధు ఇస్తారో లేదో ప్రభుత్వం చెప్పాలి. రైతుబంధుకు కోతలు పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి ఉంది. లేకపోతే, పీఎం కిసాన్ సమ్మాన్ నిధి గురించి మంత్రి చెప్పేవారు కాదు. తెలంగాణలో పీఎం కిసాన్ సమ్మాన్ 20 శాతం మంది రైతులకే వస్తోంది. రైతుబంధు యథాతథంగా ఇస్తామంటే, ఈ చర్చ ఎందుకు పత్తి, కంది 8 నెలల పంట, ఆర్థిక సాయం ఒక పంటకు ఇస్తారా, రెండు పంటలకు ఇస్తారా అనేది ప్రభుత్వం చెప్పాలి. పామాయిల్, మామిడి, ఉద్యాన పంటలకు రైతుభరోసా ఇస్తారా? 3 పంటలు సాగు చేసే రైతులకు మూడు విడతలుగా ఇస్తారా మూడో పంటకు ఇవ్వాలని గతంలో రేవంత్ అన్నారు.అసెంబ్లీ సమావేశాలు పది రోజులు పొడిగించాలి. ఎలక్ట్రిసిటీ, ఇరిగేషన్, మిషన్ భగీరథపై చర్చ చేపట్టాలి. నల్గొండ జిల్లా అభివృద్ధిపై కూడా ఒకరోజు చర్చ చేపట్టాలి. గతంలో జరిగిన తప్పులు ఎత్తిచూపితే మీకు ఇబ్బందిగా ఉంది. గతంలో చేపట్టిన ప్రాజెక్టులకు మాత్రం డబ్బా కొట్టడం సబబా, భారాస హయాంలో 24 గంటల విద్యుత్ ఇవ్వలేదని తప్పుదోవ పట్టిస్తున్నారు. భారాస పాలనలో సగటున 19.2 గంటల విద్యుత్ ఇచ్చినట్లు ఉప ముఖ్యమంత్రి చెప్పారు. కాంగ్రెస్ పాలనలో 24 గంటలు ఇస్తున్నట్లు ప్రకటనలు గుప్పిస్తున్నారు. సభ వాయిదా వేసి నల్గొండ జిల్లాకు వెళ్లి పరిస్థితులు పరిశీలిద్దాం. 24 గంటల విద్యుత్ ఇస్తున్నట్లు చూపెడితే భారాస శాసనసభాపక్షం మొత్తం రాజీనామా చేస్తుంది. రైతుబంధు మీద కాంగ్రెస్ విపరీతమైన దుష్ప్రచారం చేసింది. రైతు బతుకును మార్చిన గేమ్ ఛేంజర్ రైతుబందు అని కేటీఆర్ అన్నారు.

# డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయండి

### కార్పొరేటర్ బండారు శ్రీవాణి



**రామంతపూర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రామంతపూర్ డివిజన్లో నెలకొన్న అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి శుక్రవారం హెచ్/ఎం/డబ్ల్యు ఎస్.ఎండి.అశోక్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్లో నెలకొన్న సివరేజ్, మంచినీటి సమస్యపై ఎండి తో చర్చించి పరిష్కరించాలని కోరారు. డివిజన్ పరిధిలోని బాలకృష్ణ నగర్, రామశంకర్ నగర్, శ్రీనగర్ కాలనీ కాలనీలకు పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను, మంచినీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు.

# వైభవంగా అంబర్పేటలో మహా పడిపూజ



**అంబర్ పేట, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** సతీష్ ముదిరాజ్ గురుస్వామి ఆధ్వర్యంలో శనివారం శ్రీ అయ్యప్ప స్వామి వారి మహా పడిపూజ కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. పొన్నాడ సుందర్ గురుస్వామి చేతుల మీదుగా గోల్నాక హనుమాన్ నగర్ లో జరిగిన ఈ పడిపూజ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమనూరి సతీష్ గురు స్వామి, రాఘవ గురుస్వామి బృందం ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్ప భజన గీతాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో గురుస్వాములు తిరుపతి గుప్తా, తవిటి వెంకటేష్ ముదిరాజ్, సత్యనారాయణ గుప్తా, పండిత్, రాములు, బుజ్జి మురళీధర్, మురుగన్, మహేశ్వరి, సుమాళీక తదితరులు పాల్గొన్నారు.

# మాస్టర్ మైండ్స్ లో నేషనల్ మ్యాథ్స్ డే

### ఘనంగా రామానుజన్ జయంతి వేడుకలు



**పెబ్బేరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పెబ్బేరు పట్టణంలోని మాస్టర్ మైండ్ హై స్కూల్ ప్రాంగణంలో ప్రతి ఏటా డిసెంబర్ 22న జరుపుకునే శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులంతా రామానుజన్ నెంబర్ 1729 ఆకారంలో ఉండి నేషనల్ మ్యాథ్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులందరూ వివిధ రకాల స్కిట్స్,చార్టుల ద్వారా రకరకాల నమూనాల ద్వారా గణిత శాస్త్రంలోని సమస్యలను సులువుగా సాధించే పద్ధతులను వివరించారు. విద్యార్థులందరూ క్విజ్ ,ఉపన్యాస గణిత శాస్త్ర ముగ్గుల పోటీలలోనూ చురుకుగా పాల్గొన్నారు. పాఠశాల డైరెక్టర్ ఈ.రంగారెడ్డి మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ ప్రతిభను గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# తోమాలపల్లిలో రక్తదాన శిబిరం



**పెబ్బేరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండల పరిధిలోని తోమాలపల్లి గ్రామంలో శనివారం గ్రామ మాజీ ఉపసర్పంచ్ కీర్తిశేషులు నరేందర్ రెడ్డి జ్ఞాపకార్థం సందర్భంగా, ఎస్వీఎస్ హాస్పిటల్ సహకారంతో, మెగా రక్త శిబిరం, మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తోమాలపల్లి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ తోక నరేష్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఇట్టి కార్యక్రమాన్ని గ్రామ పెద్దలు, యువకులు, విజయవంతంగా చేయడానికి కృషి చేశారని నిర్వాహకుడు బోయ ఆనంద్ తెలియజేశారు. ఎస్వీఎస్ ఆసుపత్రి వైద్యులకు గ్రామ మాజీ ఉపసర్పంచ్ కీర్తిశేషులు నరేందర్ రెడ్డి భార్య హారిక వైద్యులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో తోమాలపల్లి గ్రామానికి చెందిన యువకులు రక్తదానం చేశారు. మెగా వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, గ్రామ యువకులు ధర్మారెడ్డి, వెంకట్రాంరెడ్డి ,మధు, మొగులన్న,గుడిసె వసంత్, రంగన్న, ప్రకాష్ ,భరత్, రాముల యాదవ్, కృపాకర్ రెడ్డి ,బీచుపల్లి,మహేష్, కేశవర్ధన్ రెడ్డి,లాలు, సురేష్, దులేందర్ తదితరులు పాల్గొన్నారు.

# పాకాలలో జగన్ జన్మదిన వేడుకలు



**చంద్రగిరి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గం పాకాలలో మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను మాజీ తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

# అమిత్ షా ఖబడ్దార్, అంబేద్కర్ జిందాబాద్





- మతోన్మాదుల నుండి దేశాన్ని రక్షించుకోవాలి
- సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం

**వైరా, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** భారత పార్లమెంట్ సాక్షిగా అంబేద్కర్ ను అవమానపరిచే విధంగా మాట్లాడిన అమిత్ షాకు కేంద్ర హోంమంత్రి పదవిలో కొనసాగే అర్హత లేదని, తక్షణమే కేంద్ర హోంమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సిపిఐ(ఎం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ(ఎం) వైరా పట్టణ, రూరల్ కమిటీల ఆధ్వర్యంలో స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నుండి అంబెద్కర్ విగ్రహం వరకు అంబేద్కర్ చిత్ర పటాలు చేబూని అమిత్ షా ఖబడ్దార్, అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేస్తూ భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ పట్టణ కార్యదర్శి చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగిన సభలో వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ అంబేద్కర్ పై తిరస్కార స్వరంతో వ్యంగ్యంగా అమిత్ షా మాట్లాడడం తన అహంకారాన్ని రుజువు చేసిందని, బీజేపీ మనువాద ధోరణి మరోసారి పార్లమెంట్ సాక్షిగా బయట పడిందన్నారు. మతోన్మాదుల నుండి దేశానికి ప్రమాదం పొంచి ఉందని, మతోన్మాదుల నుండి రాజ్యాంగాన్ని, దేశాన్ని రక్షించుకోవాలని, దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యాఖ్యలు చేస్తూ విద్వేషాలకు కారకుడైన అమిత్ షా ను వెంటనే భర్త రఫ్ చేసి మంత్రి పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు సుంకర సుధాకర్, డివిజన్ కమిటీ సభ్యులు మచ్చా మణి, తోట నాగేశ్వరరావు, తూము సుధాకర్, రూరల్ కార్యదర్శి బాణాల శ్రీనివాసరావు, పట్టణ, రూరల్ నాయకులు బొంతు సమత, గుడిమెట్ల రజిత, పైడిపల్లి సాంబశివరావు, హారి వెంకటేశ్వరరావు, అనుమోలు రామారావు, గుడిమెట్ల మోహన్ రావు, పారుపల్లి కృష్ణారావు, మల్లెంపాటి రామారావు, గుమ్మా నర్సింహారావు, షేక్ మజీద్, కామినేని రవి, తోట కృష్ణవేణి, కంసాని మల్లికాంబ, షేక్ మజీద్ బి, షేక్ రేహనా, నర్వనేని ఆదిలక్ష్మి, షేక్ నాగుల్ పాషా, పారుపల్లి శ్రీనాథ్ బాబు, మల్లెంపాటి ప్రసాదరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు, మోడా శారాబంది, మాడపాటి మల్లికార్జున్, ఎస్.డి.పాషా, యనమద్ది రామకృష్ణ, ఓర్సు సీతారాములు, అమరనేని కృష్ణ, నక్క రాంబాబు, పాసంగులపాటి చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# టెక్కలిలో వైసిపి నేత జగన్ జన్మదిన వేడుకలు



**శ్రీకాకుళం, డిసెంబరు 21 (నిఘా న్యూస్):** టెక్కలి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టెక్కలి ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు టెక్కలిలో ఘనంగా జరిగాయి. శనివారం భారీగా తరలి వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, జగనన్న అభిమానులు, మహిళలతో కలిసి టెక్కలి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టెక్కలి బీసీ సంక్షేమ హాస్టల్ లో జగన్మోహన్ రెడ్డి జన్మదిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రగ్గులు పంపిణీ చేశారు. జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలలో భాగంగా టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక్ వైఎస్ఆర్సిపి కార్యకర్తలు నాయకులతో కలిసి భారీ కేక్ కట్ చేశారు. జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా టెక్కలి నియోజకవర్గంలో భారీ రక్తదాన శిబిరం టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించారు. జన్మదిన వేడుకల్లో భాగంగా భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలు, అభిమానుల కేరింతలు నినాదాలతో దద్దరిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ టెక్కలి నియోజకవర్గం. ఈ కార్యక్రమంలో టెక్కలి నందిగాం, సంతబొమ్మాలి, కోటబొమ్మాలి, మండలాలకు చెందిన ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు, సీనియర్ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు, మాజీ ప్రజాప్రతినిధులు, మండల పార్టీ అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ అభయ ఆంజనేయస్వామి.. దేవాలయ కమిటీ ప్రమాణ స్వీకారం



**హబ్సిగూడ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ఎన్ జి ఆర్ ఐ హబ్సిగూడ లోని శ్రీ అభయ ఆంజనేయ స్వామి దేవాలయ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి దేవాలయ కమిటీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్తలుగా బిక్కుమళ్ల అంజయ్య గుప్తా, ఈగ అంగనేయులు, తుమ్మల దేవిరెడ్డి, గడ్డం లక్ష్మ రెడ్డి అమరేశ్వరి గరిక రాజేశ్వరి భూసం రఘునాథ్ రెడ్డి, మధన్ గౌడ్, ఎడ్ల అంజయ్య, ధర్మేందర్ నాయక్, ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ వెంకన్న ఫౌండర్ ట్రస్టీ లక్ష్మి నారాయణ వెంకట్ రెడ్డి నాగయ్య నర్సిములు అంజయ్య దేవాలయ అర్చకులు రవి శర్మ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కంది ఆగి రెడ్డి, బొపన్నపల్లి సుధాకర్ రెడ్డి, సల్ల రాజీ రెడ్డి, బజారు జగన్నాథ్ గౌడ్, రఘుపతి రెడ్డి, తెల్కల మోహన్ రెడ్డి, ఆకారపు అరుణ్, లింగంపల్లి రామకృష్ణ, శామీర్పేట్ రాకేష్, రఫీక్, లూకాస్, గరిక సుధాకర్ ఆగం రెడ్డి, పేట మురళి ముదిరాజ్, విపిన్ అగర్వాల్, రాజేష్ ముదిరాజ్, బాకారం లక్ష్మణ్, పాశికంటి నాగరాజ్, విజయ్, శివరాజ్ మాదిగ, సోమ్ జంగయ్య, భాస్కర్ రెడ్డి సల్ల ప్రభాకర్ రెడ్డి మంద మురళీకృష్ణ రెడ్డి చింతల బాబు రాజేందర్ రెడ్డి, అమర్ సత్యం, మహంకాళి రాజు అలుగుల అనిల్ రమేష్ నాయక్, జనగాం రామకృష్ణ, వేముల నర్సింహా రెడ్డి హనుమంత్, రాజన్న, రాఘవేందర్ కిషోర్, బోడిగా మల్లేష్ గౌడ్, పాలడుగు సంపత్ సంతోష్ గుప్తా సుశీల గీత నర్సింహా రెడ్డి, సిడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# బీరప్పగడ్డలో సీసీ కెమెరాను ప్రారంభించిన బన్నాల



**చిలుకానగర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ కాంట్రిబ్యూషన్ తో జివిపి పాయింట్ వద్ద ఏర్పాటుచేసిన నూతన సీసీ కెమెరా ను డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత, డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బస్తీల్లో వెల్ఫేర్ అసోసియేషన్ పాత్ర అభినందనీయమని బస్తీ వాసులకి చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ కాంట్రిబ్యూషన్ ద్వారా కెమెరాను ఏర్పాటు చేసినందుకు అభినందించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు మాట్లాడుతూ ఇప్పటివరకు కాలనీలోనే కాలనీ సంక్షేమ సంఘాల ద్వారా కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, మరి ఎన్నడూ ఎక్కడా లేనివిధంగా బస్తీల్లో కూడా బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ వారు కార్పొరేటర్ ప్రత్యేక చొరవతో బస్తీల్లో కెమెరాను ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అవగాహన కల్పిస్తూ దీనిలో ముఖ్యంగా కార్పొరేటర్ ప్రోత్సాహం ఎంతో ఉందని కార్పొరేటర్ కు అభినందనలు తెలిపారు. అనంతరం కార్పొరేటర్ తో డిప్యూటీ కమిషనర్, ఏ ఎమ్ హెచ్ ఓ మైత్రి బీరప్ప గడ్డలోని పలు చెత్త డంపింగ్ అయ్యే ప్రాంతాలను సందర్శించి, అటువంటి స్థలాలను రెగ్యులర్ గా మానిటర్ చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో బీరప్ప గడ్డ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోకొండ జగన్, ప్రధాన కార్యదర్శి పిట్టల రామచందర్, అసోసియేషన్ సభ్యులు, శానిటేషన్ సూపర్వైజర్ జగన్, సిబ్బంది పాల్గొన్నారు.

# రాజోలి ఆరోగ్య కేంద్రంలో సెమీ క్రిస్మస్ వేడుకలు



**జోగులాంబ గద్వాల, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** క్రిస్మస్ పర్వదినం సందర్భంగా యేసు క్రిస్తు జన్మదినాన్ని పురష్కరించుకొని రాజోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్ టియుసి) జోగులాంబ గద్వాల్ జిల్లా ప్రెసిడెంట్, శ్రమ శక్తి అవార్డు గ్రహీత ఆర్.పి.జయప్రకాశ్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సెలెబ్రేషన్స్ ఘనంగా జరిగాయి. ముందుగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మధుబాబు కాండిల్స్ వెలిగించారు. క్రిస్మస్ కేక్ ను కట్ చేశారు. యేసుక్రీస్తు చూపిన దయ, జాలి, ప్రేమ, లను మనం కూడా ఇతరుల పట్ల చూపాలని ఆయన అన్నారు. వైద్య వృత్తిపరంగా రోగులకు సేవలు చేయాలని మానవత్వం చాటాలని ఆయన సిబ్బందిని కోరారు. హ్యాపీ హ్యాపీ క్రిస్మస్, మెర్రి మెర్రి క్రిస్మస్ అంటూ నినాదాలు చేస్తూ తమ సంతోషం ను పంచుకున్నారు. అందరికీ క్రిస్మస్ కేక్ ను, ఫలాహారంను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా నాయకులు రంజిత్ కుమార్, హెలెన్, రామకృష్ణ, ఏ ఎన్ ఎమ్ లు, ఆశాలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీజీవీబీ, ఇక తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మార్పు

- ఈ నెల 28,29,30, 31 తేదీలలో బ్యాంకు సేవలకు అంతరాయం
- అడ్డగూడూరు ఏపీజీవీబీ మేనేజర్ రాజేంద్రప్రసాద్



**అడ్డగూడూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రాష్ట్రంలోని మారుమూల గ్రామాల ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు జనవరి 2025 సంవత్సరం నుండి తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా మారనుందని ఏపీజీవీబీ అడ్డగూడూరు శాఖ మేనేజర్ రాజేంద్రప్రసాద్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సేవ విభాగం ఆదేశానుసారం 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు గా మారందని చెప్పారు ఇందులో భాగంగా తెలంగాణలోని 493 ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకు శాఖలు 9 రీజినల్ ఆఫీసులో తెలంగాణ గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఈనెల 28, 29, 30, 31 తేదీల్లో బ్యాంక్ సేవలు నిలిచి పోతాయని ఖాతాదారులు గమనించాలని కోరారు. ఈ సమావేశంలో ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్ క్యాషియర్ నాగరాజు పాల్గొన్నారు.

# ప్రేమ కరుణతో నిండిన యేసు జీవితం ఆదర్శప్రాయం

### క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**రామంతాపూర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రామంతపూర్ లోని అవే మరియా స్కూల్ లో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మానవుడిలో ప్రేమ, క్షమగుణం పెంపొందాలి అనే క్రీస్తు ఆలోచన విధానం నిత్యం ఆచరణనియమని ఆయన చెప్పారు. ప్రేమ, కరుణ ద్వారా మానవాళిలో ఆనందం నింపిన యేసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయమని ఆయన తెలిపారు. విశ్వ మానవాళికి తన ప్రేమతత్వంతో వెలుగులు నింపిన కరుణమయుడని అన్నారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తన రక్తం చిందించిన ధీశాలి యేసుక్రీస్తు ప్రభువు అన్నారు. యేసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని క్రిస్మస్ పర్వదినాన్ని ఉప్పల్ ప్రజలంతా సుఖ సంతోషాలతో జరుపుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు, సీనియర్ నాయకులు పసుల ప్రభాకర్ రెడ్డి, స్కూల్ యాజమన్యం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గణిత ప్రదర్శనను ప్రారంభించిన కాటా సుధ




**అమీన్ పూర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** అమీన్ పూర్ మున్సిపాలిటీ పరిధిలోని వందనపురి కాలనీ గౌతమ్ మోడల్ స్కూల్లో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా నిర్వహించిన గణిత ప్రదర్శనకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా గౌడ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ గణిత శాస్త్రం విద్యార్థుల బౌద్ధిక వికాసానికి ముఖ్యమని, ఇలాంటి ప్రదర్శనలు వారిలో ఆవిష్కరణాత్మక ఆలోచనలను, సమస్య పరిష్కార నైపుణ్యాలను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థులు తమ ప్రతిభను గణిత ప్రదర్శనల ద్వారా ప్రదర్శించారు.

# ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



**మేడిపల్లి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** తెలంగాణ ఆహారోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ ను ఘనంగా నిర్వహించడం జరిగింది, విద్యార్థులు తయారుచేసిన వివిధ రకములైన పౌష్టిక ఆహార పదార్థాములను ప్రదర్శించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి హాజరై విద్యార్థులను అభినందిస్తూ, ఇలాంటి అనేక కార్యక్రమాలలో పాల్గొనాలని ప్రోత్సహించారు,ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యప్రసాద్, ప్రైమరి స్కూల్ ప్రధానోపాధ్యాయులు అంజిరెడ్డి, కాలనీల అధ్యక్షులు రవీందర్ రెడ్డి, రవీందర్ చారి, శివరాజు ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.



సీనియర్ న్యాయవాది, సాయిబాబా కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు బెన్నూరి చంద్రయ్య 55వ జన్మదిన వేడుకలను కాలనీ వాసులు అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శాలువా పుల మాలలు వేసి కేకు కట్ చేయించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి బ్యాంక్ వెంకటయ్య, మాజీ అధ్యక్షులు శ్రీరాములు గౌడ్, అమర్నాథ్ రెడ్డి, రామిరెడ్డి, వెంకటరెడ్డి, రాజు, శ్రీశైలం, విశ్రాంత ఉపాధ్యాయుడు, మందారం నరసింహులు, రాజేష్ కాలనీవాసులు తదితరులు పాల్గొని చంద్రయ్యకు శుభాకాంక్షలు తెలియజేశారు.

*-షాద్ నగర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):*

## విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



**ముస్తాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గౌడ అఫీషియల్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలుర అలాగే బాలికల పాఠశాల ముస్తాబాద్,చీకోడ్ గ్రామంలోని పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎల్లమ్మల లక్ష్మణ్ గౌడ్, ముత్తయ్య గౌడ్ సిరిసిల్ల పట్టణ గోపా అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ గౌడ్ ముస్తాబాద్ మండల అధ్యక్షుడు పరశురాం గౌడ్ హాజరయ్యారు. బాగా చదువుకొని ఉత్తీర్ణత సాధించి పాఠశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని గోపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్ విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ నిమ్మ రాజిరెడ్డి హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు అంబటి రవీందర్,వేముల నరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు గణితంపై ఆసక్తిని పెంపొందించుకోవాలి

### నిజాంపేట్ మున్సిపల్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ లు ముఖ్య అతిథులుగా నిజాంపేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని పాఠశాలలో విద్యార్థులు నిర్వహించిన మ్యాథ్స్ మేళాలో పాల్గొన్నారు. మొదటిగా విద్యార్థులు గణిత శాస్త్రానికి సంబంధించిన వివిధ పరికరాలను తయారు చేసి మేళాలో ప్రదర్శించారు. డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చిన్నప్పటి నుంచే గణితంపై ఆసక్తి కలిగి ఉండాలని అన్నారు. విద్యార్థి దశ నుంచే గణితంపై దృష్టి సారించి బాల మేధావులుగా ఎదగాలని కోరారు. గణిత శాస్త్రం మానవ, సామాజిక అభివృద్ధిలో ఎంతో ప్రాముఖ్యత కలదని, గణితం లేకుండా మానవ ప్రగతిని అభివృద్ధిని ఊహించలేమని తెలుపుతూ విద్యార్థినీ విద్యార్థులు తయారు చేసిన కృత్యాలను తిలకించి, అనంతరం క్విజ్ రంగోలి, గణిత నమూనాలా ప్రదర్శన నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులుఅందజేశారు. ఈకార్యక్రమంలోప్రధాన ఉపాధ్యాయుడురఘునాథ్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సెంయిట్ ఆన్స్ లో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**మేడ్చల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని ఉమా నగర్ లో, సెయింట్ ఆన్స్ పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ లూర్ధురత్నపాఠశాలలో ఘనంగా క్రిస్మస్ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రెవరెన్స్ ఫాదర్ తిజో థామస్, రెవరెన్స్ సిస్టర్ ప్రభ, విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెవరెన్స్ ఫాదర్ తిజో థామస్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగను ఉద్దేశిస్తూ ప్రభువైన యేసు ప్రజలపై దయ, ప్రేమ, కరుణ, ఎలా చూపాడో అదేవిధంగా మనం కూడా ప్రభువు చూపిన దారిని అనుసరించాలని అన్నారు. పాఠశాలలో సర్వమత విద్యార్థులు విద్యను అభ్యసించడం జరుగుతుందని అన్నారు. పాఠశాలలో ప్రతి పండగను విద్యార్థులతో కలిసి జరుపుకోవడం వాళ్ళ సంస్కృతిని గుర్తు చేసినట్టు అవుతుందని అన్నారు.

### పాపయ్య గౌడ్ కు బిజెపి సభ్యత్వ నమోదు పత్రాలు అందజేత



**పహాడీషరీఫ్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు సభ్యత్వ నమోదు లిస్టుని జాతీయ కిసాన్ మోర్చా సభ్యులు పాపయ్య గౌడ్ కు అందించారు. ఈ సందర్భంగా కాంటేకార్ మధుమోహన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్నటువంటి సభ్యత్వ నమోదు కార్యక్రమం ద్వారా భారతీయ జనతా పార్టీ మరింత బలోపేతం కానుందని తెలిపారు.

# ఎన్ఎస్ఎల్ ఈస్ట్ టవర్స్ ఫ్లాట్ల యజమానుల ధర్నా

### ఫ్లాట్ లలో లీకేజీలను అరికట్టి మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్



**ఉప్పల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ఉప్పల్ లోని క్రికెట్ స్టేడియం ముందు గల ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ టవర్ అపార్ట్మెంట్ వద్ద ఫ్లాట్ యాజమానులు శుక్రవారం ప్లకార్డులు ప్రదర్శిస్తూ ధర్నా నిర్వహించి రామంతపూర్ ప్రధాన రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎల్ ప్రధాన కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఎన్ఎస్-ఎల్ ఈస్ట్ కౌంటి టవర్ లో 24 అంతస్తులు 900 ఫ్లాట్లు 300 కుటుంబాలు నివసిస్తున్న ఫ్లాట్లలో భారీగా లికేజీలతో ఫ్లాట్ యాజమానులు ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. మెయింటనెన్స్ చార్జీలు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. కానీ మెయింటనేన్స్ మాత్రం శూన్యం అంటూ ఫ్లాట్ యాజమానులు ఆందోళనకు దిగారు. 24 అంతస్తుల రెండు టవర్స్ లో మొత్తం 900ఫ్లాట్స్, టవర్ 1 పూర్తి అయింది. సుమారు సమత్సర కాలం నుండి 300 కుటుంబాలు నివాసం ఉంటున్నారు. టవర్ 2 ఇంకా నిర్మాణంలో ఉందని తెలిపారు. కొనుగోలు చేసిన ఫ్లాట్ యజమానులకు రేరా నిబంధనల ప్రకారం వసతులు ఉండాలి కానీ ఎలాంటి నిబంధనలు పాటించడం లేదని ఎన్ఎస్ఎల్ ఈస్ట్ కౌంటీ కంపెనీపై ఫ్లాట్ యాజమానులు మండిపడుతున్నారు. గతంలోనూ అనేక సార్లు నిరసనలు వ్యక్తం చేసిన సమస్యలు మాత్రం యధావిధిగా ఉన్నాయే తప్ప, సంస్థ సమస్యను తీర్చుటకు చర్యలు చేపడుతలేదని ఫ్లాట్ యాజమానులు ఆవేదన వ్యక్తం చేశారు. లీకేజీ సమస్యను పరిష్కరించి, నిబంధనల ప్రకారం ఎలాంటి ఇబ్బందులు లేకుండా సదుపాయాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఎస్.వి.రమణ, డాక్టర్ వెంకటేష్ రావు, పురోషోత్తం, జితేంద్ర, మంజుల, సత్యవాణి, సుజాత, పుష్ప, స్వప్న, ప్రతిభ, రూప లతోపాటు పెద్ద ఎత్తున ఫ్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

# జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం





### అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన గొంగులూరి వేణుగోపాల్ శర్మ

**ఉప్పల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మేడ్చల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. మహాత్మాగాంధీ కమ్యూనిటీ హాల్ ఈస్ట్ కళ్యాణ్ పురిలో ఈ ఎన్నికలు జరిగాయి. అధ్యక్షుడుగా గొంగులూరి వేణుగోపాల్ శర్మతో పాటు అతని ప్యానల్ మొత్తం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఎన్నికలలో వేణుగోపాల్ శర్మ ప్యానల్ విజయం సాధించింది. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శుల మూడు సంవత్సరాల పదవీ కాలం పూర్తి కావడంతో శుక్రవారం ఎన్నికలు జరిగాయి. అయితే గొంగులూరి వేణుగోపాల్ శర్మ ప్యానల్‌కు వ్యతిరేకంగా ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. దాంతో ఎన్నికల నిర్వాహకులు వీరి ఎన్నికలను ఏకగ్రీవ ఎన్నికలుగా ప్రకటించారు. గత ప్యానల్ చేసిన సేవలకు గుర్తింపుగా మళ్ళీ అదే ప్యానల్‌ను మేడ్చల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ తమపై వున్న నమ్మకంతో కెమిస్ట్ అండ్ డగ్రిస్ట్ సోదరులు అందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులందరికీ తమపై వున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వాగ్దానం చేశారు. మేడ్చల్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ సభ్యులందరికీ ఎల్ల వేళలా అందుబాటులో వుంటామని, వారికి ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూస్తామని చెప్పారు. ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు, ప్యానల్ సభ్యులను ఘనంగా సత్కరించారు. రాబోయే రోజుల్లో ఎదుర్కొనాల్సిన సమస్యలపై కొద్దిసేపు చర్చించి, సభ్యుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ ఎన్నికలలో అధ్యక్షుడుగా గొంగులూరి వేణుగోపాల్ శర్మ ,ప్రధాన కార్యదర్శిగా తిరుమల్ రెడ్డి, నాగరాజు ట్రెజరర్ గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. టిటిసిడిఏ పరిశీలకులుగా ఆర్గనైజింగ్ సెక్రటరీలు గాలిపెల్లి నరసయ్య, బోడ రవీందర్, ఎన్నికల అధికారిగా పి కిరణ్ కుమార్ వ్యవహరించారు.

# సర్టిఫికెట్స్ లేక విద్యార్థుల ఆత్మ హత్యలు

- 3580 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ ని విడుదల చేయాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం డిమాండ్




**శ్రీకాకుళం, డిసెంబరు 21 (నిఘా న్యూస్):** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్లో ఉన్న 3580 కోట్ల ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ విడుదల చేయాలని శ్రీకాకుళం రామలక్ష్మణ జంక్షన్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్.నాగభూషణం, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా విద్యా దీవెన, వసతి దీవెన లను (ఏంటిఎఫ్, ఆర్.టి.ఎఫ్) మార్చినది కానీ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెండింగ్లో ఉన్న బకాయిలను చెల్లించడంలో అలసత్వం వహిస్తున్నది. అందువల్ల విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి విద్యాసంస్థల యాజమాన్యాల వద్ద నుండి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే విద్యా సంవత్సరం పూర్తి చేసుకుని, ఫీజులు చెల్లించలేక కళాశాలల్లోనే సర్టిఫికెట్లు ఉంచి ఉన్నత విద్య చదవలేక, మరో పనికి వెళ్లలేక, తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆ మేరకు ప్రభుత్వ లెక్కల ప్రకారం యాజమాన్యాల వద్ద ఏడు లక్షల విద్యార్థులు సర్టిఫికెట్లు ఉంచారు. యాజమాన్యాల దగ్గర సర్టిఫికెట్ ఉండడం ఎవరికి ప్రయోజనం మరో పక్కన ప్రభుత్వం యాజమాన్యాల అందరికి పూర్తిగా చెల్లిస్తాం, విద్యార్థులకు అడ్మిషన్స్ సమయాల్లో, పరీక్షల సమయంలో ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు పెట్టకూడదు అనే స్పష్టమైన ఆదేశాలు లేకపోవడం వల్ల విద్యార్థుల వద్ద నుండే పేరు మోసిన కళాశాలలో ముక్కు పిండి వసూలు చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం పెండింగ్లో ఉన్న బకాయిలను విడుదల చేయాలి, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు పూర్ణ, రాజు, ప్రవీణ్, రమేష్ కుమార్ ,శ్రీను, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# చిత్రకారుడు త్రివిక్రమ్ ను అభినందించిన ఎమ్మెల్యే వేగుళ్ళ



**రాయవరం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కోనసీమ జిల్లా మండపేటలో శ్రీ సాయి విజ్ఞాన్ జూనియర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ విభాగంలో చదువుతున్న దాస్యం వెంకట త్రివిక్రమ్, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర్ రావు చిత్రపటాన్ని కలర్ పెన్సిల్ పెయింటింగ్ తో అద్భుతంగా రూపొందించి శ్రీ సాయి విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ యాజమాన్యంతో కలిసి ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వర్ రావుకి అందజేశారు. ఈ సందర్భంగా అద్భుత చిత్ర శైలిని ప్రదర్శించిన త్రివిక్రమ్ ను, విద్యతో పాటు వివిధ రంగాలలో ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించడం లో ముందు వరసలు వుంటున్న శ్రీ సాయి విజ్ఞాన్ జూనియర్ కాలేజీ చైర్మన్ డాక్టర్ మల్లిడి అమ్మి రెడ్డిని ప్రిన్సిపాల్, అధ్యాపక బృందాన్ని, ఎమ్మెల్యే రాయవరం తెలుగుదేశం నాయకులు రాంబాబు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేటు కళాశాలకు దీటుగా విద్యతో పాటు అన్ని రంగాలలో శ్రీ సాయి విద్య జూనియర్ కాలేజ్ విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో లోల్ల సర్పంచ్ సిహెచ్ జానకి రాంబాబు, శ్రీ సాయి విజ్ఞాన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల అచ్చిరెడ్డి, వి ఎస్ ఆర్ రూరల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మల్లిడి సతీష్ రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

### చైన్ స్నాచర్లపై ఉక్కుపాదం..

# మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదు: రాచకొండ సీపి



**మల్కాజిగిరి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కమీషనరేట్ పరిధి ఎల్ బీ నగర్ జోన్ లో ఈ సంవత్సరంలో మొత్తం 25 చైన్ స్నాచింగ్ కేసులు నమోదు కాగా క్రైమ్ సిబ్బంది, సిసిఎస్ ఎల్బీనగర్, ఐటీ సెల్ సహకారంతో అన్నిటిని త్వరితగతిన విచారణ జరిపి దాదాపు కేసులను పరిష్కరించారని అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా 18 మంది సిబ్బందిని అధికారులను రాచకొండ కమిషనరేట్ లో అభినందించి కమిషనర్ సుదీర్ బాబు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణలో రాజీ పడకుండా అహర్నిశలు కృషి చేస్తున్నామని, మహిళల రక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో సీసీటీవీలను విస్తృతంగా వినియోగించడం కూడా కేసుల విచారంలో అధికారులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మహిళల పట్ల నేరాలకు పాల్పడే వారిని, చైన్ స్నాచర్లనను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కమిషనర్ హెచ్చరించారు. ఎల్బీనగర్ డిసిపి ప్రవీణ్ కుమార్, ఎస్ఓటి డిసిపి మురళీధర్, ఎస్ఓటి అడిషనల్ డీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, వనస్థలిపురం ఏసిపి కాశిరెడ్డి, వనస్థలిపురం, మీర్పేట్ డిఐలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ఉద్యమ కళాకారుల సదస్సుకు వలిగొండ నేతలు



**వలిగొండ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** వలిగొండ మండలం హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం ఉద్యమ కళాకారుల ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగు అంజన్న ఆధ్వర్యంలో ఉద్యమకారుల ఫోరం నాయకులు పీర్లు బతుకమ్మలు బోనాలతో ప్రదర్శనగా బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే ఉద్దేశంతో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడానికి ఈ సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కో కన్వీనర్ శీలం స్వామి, యాదాద్రి భువనగిరి జిల్లా గౌరవ అధ్యక్షుడు కళ్లెం లక్ష్మారెడ్డి, జిల్లా అధ్యక్షుడు గంధ మల్ల బాలయ్య, మహిళా అధ్యక్షురాలు గంధమల్ల మల్లమ్మ, వలిగొండ మండల అధ్యక్షుడు మారగోని శ్రీనివాస్ గౌడ్, బత్తిని రవీందర్ గౌడ్, కదిరేని స్వామి, జిల్లా సాంస్కృతిక కార్యదర్శి మల్లం వెంకటేశం గౌడ్, సురూపంగా గణేష్, ఎక్కలదేవి శ్రీనివాస్, ఐటి పాముల పుష్పమ్మ,కొండూరు సత్తయ్య, కిరణ్, యూసుఫ్, షేక్ నబి, శీలం ఇందిర, బురాని మున్నీ కౌర్, అంజమ్మ, శ్యామల యాదమ్మ, బత్తుల మంగ తదితరులు వెళ్లారు.

## సైక్లింగ్ పోటీలను ప్రారంభించిన చైర్ పర్సన్ హేమలత




**పహాడీషరీఫ్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రంగారెడ్డి జిల్లా సిఎం కప్ సైక్లింగ్ పోటీలలో భాగంగా మహేశ్వరం మండలం తుక్కుగూడ మున్సిపాలిటీలో పోటీలను సైక్లింగ్ ప్రారంభోత్సవంలో ముఖ్యఅతిథిగా తుక్కుగూడ మున్సిపాలిటీ చైర్పర్సన్ బరిగెల హేమలత గౌడ్ విచ్చేసి ప్రారంభించారు. ఈ పోటీలలో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ రాజమోని రాజు ముదిరాజ్, జపాల భావన సుధాకర్, తెలంగాణ ఒలంపిక్స్ అసోసియేషన్ సెక్రటరీ మల్లారెడ్డి, తుక్కుగూడ జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి ,రంగారెడ్డి జిల్లా సైకిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## బచ్ పన్ పాఠశాలలో ఎడ్యుఫెయిర్



**బోడుప్పల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అకాడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ లో శనివారం ఎడ్యు ఫెయిర్ ఘనంగా జరిగినది. వివిధ విభాగాలలో అన్ని అంశాలలో తమ ప్రతిభను విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా సిఎస్ఐఆర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ త్రిపుర హాజరై విద్యార్థులను అభినందించారు. పాఠశాల టెక్నికల్ డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్స్ కె.కౌషిక్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాల ద్వారానే కాకుండా ఇలాంటి కార్యక్రమాల ద్వారా వారిలోని సృజనాత్మక నైపుణ్యాలను వెలికి తీయవచ్చని తెలియజేసారు. విద్యార్థులు కనబరిచిన ప్రతిభను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ నీలిమా జెనీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బీహార్ గ్యాంగ్ ను అరెస్టు చేసిన పోలీసులు

### జిల్లా ఎస్పీ.కెవి.మహేశ్వర రెడ్డి



**శ్రీకాకుళం, డిసెంబరు 21 (నిఘా న్యూస్):** శ్రీకాకుళం జిల్లా పలాస - కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఉన్న చిన్నబాడం గ్రామ నివాసి తెలుగుదేశం పార్టీ నాయకులు బడ్డ నాగరాజు అను వ్యక్తిపై హత్యా యత్నానికి కుట్ర పన్నిన వ్యక్తులతో సహా బీహార్ గ్యాంగ్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పోలీసుల కథనం ప్రకారం చిన్నబడాం గ్రామానికి చెందిన కూర్మాపు ధర్మారావు,అతని అనుచరులు పన్నిన హత్యాయత్నం విఫలమై పట్టుబడిన నిందితులపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో నమోదు చేసిన కేసు వివరాలను శనివారం కాశీబుగ్గ పోలీసు స్టేషనులో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పీ కే.వి.మహేశ్వరరెడ్డి వెల్లడించారు. పై కేసును చాకచక్యంగా చేదించుటలో అదనపు ఎస్పీ కెవి రమణ, కాశీబుగ్గ డిఎస్పి ఎం.అప్పారావు,టెక్కలి డిఎస్పి డి.ఎస్.ఆర్.వి.ఎన్ మూర్తి పర్యవేక్షణలో క్రియాశీలకంగా వ్యవహరించి, ముద్దాయిలను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేవి మహేశ్వర రెడ్డి అభినందించారు.

## ప్రభుత్వ పాఠశాలలో గణిత దినోత్సవం



**ముస్తాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ముస్తాబాద్ మండల కేంద్రంలో ముందస్తు గణిత దినోత్సవ వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు అంబటి రవీందర్, గణిత శాస్త్ర ఉపాధ్యాయులు జోత్న్స, జ్యోతిరాణి, ఉపాధ్యాయులు విద్యార్థులు గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గణిత ఫార్ములా టెస్ట్, క్విజ్ పోటీలు, గణితం సంబంధించి వివిధ రకాల స్కిట్స్, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. విద్యార్థులందరు రామానుజన్ నెంబర్ 1729 ఆకారంలో కూర్చోవడం అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, రాజ్ మహమ్మద్, లక్ష్మణ్, వీరాస్వామి, ఎల్లారెడ్డి, శంకరయ్య గోవర్ధన్, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజశేఖర్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంఘాల ఆధ్వర్యంలో.. అమిత్ షా దిష్టిబొమ్మ దహనం




**ఉప్పల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హెూం మంత్రి అమీషాను వెంటనే మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేస్తూ దిష్టిబొమ్మ దహనం చేశారు. సిఐటియు, ఐద్వా రజక సంఘం, కెవిపిఎస్ ఆధ్వర్యంలో పార్లమెంటు సాక్షిగా అంబేద్కర్ ని అవమానపరిచే విధంగా మాట్లాడిన అమీషాను వెంటనే మంత్రి పదవి నుండి తొలగించాలని, అమిత్ షా బేషరతుగా క్షమాపణలు చెప్పాలని కోరుతూ ఉప్పల్ సీఐటీయూ కార్యాలయం నుండి మెయిన్ రోడ్డు కరెంట్ ఆఫీస్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించి అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఉప్పల్ సర్కిల్ కార్యదర్శి జే.వెంకన్న, సిఐటి నాయకులు ఎం. అశోక్ రెడ్డి, ఎస్. నాగరాజు, జంగయ్య, స్వామి, లాలు, నరసింహ, రజక సంఘంసంఘం నాయకులు జే.ఉపేందర్, రవి కెవిపిఎస్ నాయకులు బాలయ్య, ఐద్వా నాయకులు ఊర్మిళ, పద్మ, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## రావి నారాణరెడ్డి చౌరస్తాలో అమిత్ షా దిష్టిబొమ్మ దహనం



**అబ్దుల్లాపూర్ మెట్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో శనివారం రావి నారాయణరెడ్డి చౌరస్తా దగ్గర బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై లోక్ సభలో అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ అమిత్ షా కు కేంద్ర మంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదని అమిత్ షాను బర్తరఫ్ చేయాలి డిమాండ్ చేస్తూ సిపిఐ నాయకులు అమిత్ షా దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాది రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు, స్థానిక కౌన్సిలర్ పబ్బతి లక్ష్మణ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు, మాజీ కౌన్సిలర్ అజ్మీర హరిసింగ్ నాయక్, కౌన్సిల్ మరియు కార్యవర్గ సభ్యులు, భూ పోరాటా కమిటీ సభ్యులు, మహిళా సమైక్య నాయకురాలు, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సర్పంచ్ అక్బర్ హుస్సేన్ మృతి



**నారాయణపేట, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని పెద్ద పోర్ల గ్రామంలో శనివారం మాజీ సర్పంచ్ అక్బర్ హుస్సేన్ అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. గ్రామ ప్రజలను చిరునవ్వుతో పలకరించే అక్బర్ హుస్సేన్ మరణంతో ముస్లింలు పెద్ద దిక్కును కోల్పోయామని కంటతడి పెట్టారు. ఏ పార్టీకి చెందిన వ్యక్తి అయినా గౌరవంతో పలకరించే వ్యక్తి బాధలో ఉన్న వారికి తన వంతు ఆర్థిక సహాయం అందించేవాడని స్థానికులు కన్నీటి పర్యంతమయ్యారు.

# బడుగుల జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు

### అంబేద్కర్ జోలికి వస్తే ఎవరినైనా తరిమి కొడతాం

### డిబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్



**హన్మకొండ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ పై పార్లమెంటు సాక్షిగా అనుచితంగా మాట్లాడి అవమానించిన కేంద్ర హెూం మంత్రి అమిత్ షాను ఖబర్దార్ అమితిషా. అంబేద్కర్ జోలికి వస్తే తరిమి కొడతామని దళిత బహుజన ఫ్రంట్ (డిబీఎఫ్) జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ హెచ్చరించారు. శనివారం వరంగల్ నగరపాలక సంస్థ 32 వ డివిజన్ కరీమాబాద్ పరిధిలోని బీరన్నకుంటలో డిబీఎఫ్ ఆధ్వర్యంలో కేంద్ర హెూం మంత్రి అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడి, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా, బీజేపీ పెద్దలకు దేవుడు మనవు ఐతే, మాకు మాత్రం మా జీవితాల్లో వెలుగులు నింపిన దేవుడు అంబేద్కర్ మాత్రమేనని, ఆయనను అవమానించడం ముమ్మాటికి భారత ప్రజలను అవమానించినట్లేనని, వెంటనే అమిషాను పదవి నుంచి తొలగించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిబీఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డిబీఎఫ్ నాయకులు పోలేపాక మల్లేశం, పోగుల రాజు, పోలేపాక రాము, కొలిపాక రమేష్, లింగాల రాజన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# పలమనేరులో ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

### మున్సిపల్ కార్మికులకు బట్టల పంపిణి చేసిన ఎమ్మెల్యే



**పలమనేరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పలమనేరులో సెమీ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పలమనేరు మున్సిపాలిటీ 14వ వార్డు కౌన్సిలర్ సునీత నాగరాజు ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన క్యాండిల్ వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. భగవంతుడు చూపిన మార్గాన్ని అనుసరించి పక్కవారికి సాయం చేస్తూ ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో రాణించాలని ఆయన ఆకాంక్షించారు. ప్రపంచంలోనే భారతదేశం గొప్పదని పేర్కొన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. అంతకు ముందు స్థానిక పాస్టర్లు క్రిస్మస్ ప్రాముఖ్యతను క్రీస్తు జననం గురించి తెలియజేశారు. ఇక చివరిగా నిస్వార్థంతో నిత్యం సేవలందించే స్థానిక మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే బట్టలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలమనేరు తాసిల్దార్ ఇన్బనాథన్, కమిషనర్ రమణారెడ్డి, సీఐ నరసింహ రాజులతో పాటు పలువురు కౌన్సిలర్లు సిబ్బంది తెలుగుదేశం పార్టీ నాయకులు కిషోర గౌడ, సుబ్రహ్మణ్యం గౌడ్, గిరిబాబు, బ్రహ్మయ్య, మదన్, శ్రీధర్, చిన్నీ, సుధాకర్, శీనా, సుబ్బు, నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ ధ్యాన దినోత్సవం



**వరంగల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** వరంగల్ నగరంలో శనివారం యోగ అండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంగశాయిపేట జూనియర్ కళాశాల మైదానంలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం బాధ్యులు పెసర నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ భారత్ సహకారంతో ఐక్య రాజ్య సమితి డిసెంబర్ 21 వ తేదీని అంతర్జాతీయ ధ్యాన దినోత్సవంగా ప్రకటించింది అని తెలిపారు. అదేవిధంగా ప్రతి వ్యక్తి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉన్నప్పుడు మాత్రమే సంపూర్ణ ఆరోగ్యవంతుడని శారీరక ఆరోగ్యానికి వ్యాయామం ఎంత అవసరమో మానసిక ఆరోగ్యానికి ధ్యానం కూడా అంతే అవసరమని తెలుపుతూ దైనందిన జీవితంలో ఎదురవుతున్న సవాళ్లు, వత్తిడిలను అధిగమించాలంటే ప్రతి వ్యక్తి రోజుకు కొంత సమయం ధ్యానానికీ కెటాయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్గం నవీన్ కుమార్, పోశాల కన్నయ్య, కొండ్రెడ్డి నవీన్ రెడ్డి, కావటి కరుణాకర్, దొమ్మాటి సుభాష్, బోడిగ సాంబయ్య, దబ్బగట్ల గోపాలరావు, ఎలుమకంటి రాంబాబు, ప్రతాపరెడ్డి, రహమత్ ఖాన్, శంకేసి వేణు, పాకాల చంద్రశేఖర్, డాక్టర్అంజయ్య, యాకయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# కంటి గాయాలతో అప్రమత్తంగా ఉండాలి

### కంటి వైద్య నిపుణులు డాక్టర్ పరవేష్



**వికారాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మానవ శరీరంలో కళ్ళు అనేవి చాలా సున్నితమైనవని కంటి వైద్య నిపుణులు డాక్టర్ పరవేష్ వెల్లడించారు. కంటి గాయాల విషయంలో అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని జనరల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ రామచంద్రయ్య, కంటి వైద్య విభాగపు అధికారిణి డాక్టర్ పద్మ ఆధ్వర్యంలో తనతో పాటు కంటి వైద్య నిపుణులు డాక్టర్ మన్నం గీతాంజలి డాక్టర్ కళావతి, డాక్టర్ సునీత, డాక్టర్ ధృతి కంటి వైద్య విభాగానికి కంటి సమస్యలతో సందర్శించిన ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం జరుగుతుందని వివరించారు. కంటి శుక్లాలు ఉన్నవారికి శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందని తెలిపారు. వెల్డింగ్ పనులు చేయు కార్మికులు, నాపరాతి గనులలో పనిచేసే కార్మికులు కంటి విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించి తమ విధి నిర్వహణ చేసుకోవాలని వెల్లడించారు. ఇనుప ముక్కలు (మెటల్) తో, నాపరాతి సన్నని ముక్కలు కళ్ళలోని నల్ల గుడ్డుకు తగిలి ప్రమాదవశాత్తు గాయమైతే కంటి చూపు శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తు చేశారు. వీరు ప్రత్యేకమైన సంబంధిత కళ్ళ అద్దాలు ధరించాలని సూచించారు. వీరితోపాటు ద్విచక్ర (బైక్) వాహనదారులు హెల్మెట్ కానీ, కళ్ళ అద్దాలు లేకుండా వాహనాలు నడపకూడదని పేర్కొన్నారు. రైతులు సైతం పొలం పనుల విషయంలో జాగ్రత్తలు పాటించవలసిన ఆవశ్యకత ఉందని అన్నారు. కంటి జాగ్రత్తలు పాటించిన కానీ ప్రమాదవశాత్తు కళ్లకు గాయమైతే ప్రాథమిక దశలోనే కంటి వైద్య నిపుణులను సంప్రదించి, డాక్టర్ల సూచనల ప్రకారం వైద్య సేవలు పొంది, ఇక ముందు నుండి కంటికి గాయాలు కాకుండా కంటి జాగ్రత్తలు, ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని స్పష్టం చేశారు. కంటి జాగ్రత్తలు ప్రతి ఒక్కరూ పాటించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ ధృతి పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు పెట్రోలింగ్ నిర్వహించాలి



### సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

**రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** నేరాల నియంత్రణకు గ్రామాల్లో, పట్టణాల్లో ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లాలో నేరాలు జరుగుతున్న తీరు, ఎక్కువగా నేరాలు జరుగుతున్న ప్రాంతాలు గుర్తించి ఆయా ప్రాంతాల్లో ప్రతి రోజు సాయంత్రం సమయంలో బీట్స్ (గస్తీ) ఏర్పాటు చేసి ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండి ముందస్తు నేరా నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలనీ సూచించారు. అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులను త్వరగా డిస్పోజల్ చేయాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి కోర్టులో ఛార్జ్ షీట్ దాఖలు చేయాలని, ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండడంతో పాటు పూర్తి పారదర్శకంగా కేసును ఇన్వెస్టిగేషన్ చేయాలన్నారు. దొంగతనాలపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి నిఘాను పటిష్టం చేయాలని, దొంగతనం కేసులల్లో ప్రతి రోజు కేసుల చెదనలో భాగంగా అన్ని కోణాల్లో ప్లాన్ ఆఫ్ యాక్షన్, ఎస్ఓపి ప్రకారం ఇన్వెస్టిగేషన్ చేసి కేసులు చేధించాలని, ప్రజలతో సత్సంబంధాలు ఏర్పరుచుకోని ఇన్ఫర్మేషన్ వ్యవస్థ పటిష్టం చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల్ని భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ల పరిధిలో గంజాయి, పేకాట, పిడిఎస్ రైస్, గుడుంబా, ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలని, ఇతర చట్టవ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలని అధికారులకు ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రతి రోజు డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని, ఓవర్ స్పీడ్, ట్రిపుల్ డ్రైవింగ్, మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ లు నిర్వహించాలని అన్నారు. విధి నిర్వహణలో ఉత్తమా ప్రతిభ కనబర్చిన అధికారులకు, సిబ్బందిని అభినందించి ప్రశంసా ప్రోత్సాహకాలు అందించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సి.ఐ లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు, ఐటీ కోర్ సిబ్బంది పాల్గొన్నారు.

## గంగదేవిపల్లిలో గణిత దినోత్సవం



**వరంగల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** వరంగల్ ఉమ్మడి జిల్లాలోని గంగదేవిపల్లిలో శనివారం జాతీయ మ్యాథమెటిక్స్ డే సందర్భంగా జడ్పీహెచ్ఎస్ గంగదేవిపల్లి పాఠశాలలో మ్యాథమెటిక్స్ డే ను పాఠశాల గణిత బోధకుడు శ్రీనివాసచారి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహమ్మద్ రజాక్ మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ పుట్టినరోజు సందర్భంగా గణిత దినోత్సవం జరుపుకుంటున్నాము అని, జీవితంలో గణితం ఎంతో అవసరం అది లేని జీవితాన్ని ఊహించడం కష్టమని అన్నారు. ఉదయం లేచినది మొదలు పడుకునే వరకు జీవితంలో పెనువేసుకొని ఉంటుందని అన్నారు. గణితం వస్తే విద్యార్థిని ఎంతో చురుగ్గా ఉంటారని అన్నారు. అనంతరం విద్యార్థుల చేత రంగోలి, వ్యాసరచన, వక్తృత్వం, క్విజ్, తదితర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది. కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఎండి రజాక్, శ్రీనివాసచారి, వెంకటేశ్వర్లు, స్వరూపరాణి, రతన్ సింగ్, మాధురి, కుమారస్వామి, ఎండి యూసుఫ్ ఖాన్, జేసింత, రాణి విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్



**అశ్వారావుపేట, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** అశ్వారావుపేటలో ద్విచక్ర వాహనాలను మాయం చేస్తున్న కేటుగాడిని పోలీసులు పట్టుకున్నట్లు సీఐ తాటిపాముల కరుణాకర్ తెలిపారు. శనివారం ఎస్ఐ యయాతి రాజు సిబ్బందితో కలసి అశ్వారావుపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై వస్తు పోలీసుల చూసి తప్పించుకునేందుకు ప్రయత్నించాడు. సదరు వ్యక్తి అశ్వారావుపేలోని కెమిలిడ్స్ ఫాక్టరీ ఎదురుగా పార్కింగ్ చేసి వున్న ఓ ద్విచక్ర వాహనం దొంగిలించి పారిపోతున్నట్టు పోలీసులు గుర్తించారు. పోలీస్లు ఆ వ్యక్తిని వెంబడించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు ఏపీలోని దేవరపల్లి మండలం యాదవోలు గ్రామానికి చెందిన మారం మునియ్య అని పోలీసులు తెలిపారు. ఇతనిపై తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 69 కేసులు ఉన్నాయని, 8 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి, నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్టు సీఐ కరుణాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేందర్, కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు, నరేష్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## రచ్చపల్లి పాఠశాలను సందర్శించిన లక్నో అధ్యయన బృందం



**ధర్మపురి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** నియోజకవర్గంలోని ధర్మారం మండలం రచ్చపల్లి ప్రాథమిక పాఠశాలను శనివారం లక్నో నుండి వచ్చిన బృందం సందర్శించింది. ఈ సందర్భంగా బృందంలోని సభ్యులు ప్రవీణ్ యాదవ్, అత్తర్ సలీమ్ లు ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతుల విద్యార్థులకు తెలుగు, ఆంగ్లంలో చదవటం, రాయటం, గణితంలో చతుర్విద ప్రక్రియల్లో ఎఫ్.ఎల్.ఎన్ కు అనుగుణంగా ఆశించిన సామర్థ్యలను పరిశీలించగా విద్యార్థిలందరూ అట్టి సామార్థ్యలను సాధించినారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను లక్నో అధ్యయన బృంద సభ్యులు ప్రశంసించారు. అలాగే పేరెంట్ టీచర్ మీటింగ్ లో పాల్గొని ఎఫ్.ఎల్.ఎన్ కార్యక్రమం గురించి తల్లిదండ్రులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సముద్రాల వంశీమోహనాచార్యులు, ఉపాధ్యాయులు సంపత్, లక్ష్మణ్, ఏఏపిసి చైర్ పర్సన్ తాళ్ళ ప్రమీల, మండల విద్యాధికారిణి ఫినుమల్ల ఛాయాదేవి, అకాడమీక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎమ్. షేక్, జిల్లా రిసోర్సు పర్సన్ శ్రీకాంత్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



కాళ్ళకల్ మాజీ సర్పంచ్ మల్లేష్ అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమానికి రావలసిందిగా కోరుతూ ఎమ్మెల్యే రఘునందన్ రావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు.
*-మనోహరాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):*

# ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల ఏర్పాటు

### దశాబ్దపు కలను నెరవేర్చిన జిల్లా కలెక్టర్
### ప్రధానోపాధ్యాయుడు రాధా కిషన్ రావు

**ముస్తాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం పోతుగల్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దశాబ్ద కల నెరవేరింది, పాఠశాలలో చదివే అమ్మాయిలకు మరుగుదొడ్డి మూత్రశాలలు లేక ఇబ్బందులు ఎదుర్కొన్న సందర్భంగా కలెక్టర్, గ్రామపంచాయతీ నిధుల ద్వారా రెండు గదులను కాంట్రాక్టర్ నారాయణరావు సకాలంలో నిర్మాణం పూర్తి చేశారు. పోతుగల్ ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సింలు ఏ ఏ పీ సి చైర్మన్ ముచ్చర్ల భార్గవి,వరి జ్యోతి సమక్షంలో శనివారం నుండి వాడకలోకి తీసుకురావడం జరిగిందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాధా కిషన్ రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీనికి ప్రోత్సహించిన తాజా మాజీ సర్పంచ్ తన్నీరు గౌతమ్ రావు తదితరులకు ధన్యవాదాలు తెలియజేశారు. ప్రధాన ఉపాధ్యాయుడు రాధా కిషన్ రావు మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో భాగంగా (మోటివేటర్) ప్రముఖ సి ఏ జెట్టి మల్లేశంను ఆహ్వానించడం జరిగిందని మల్లేశం, ముస్తాక్ అలం తమ ఉపన్యాసంతో విద్యార్థులకు తల్లిదండ్రులను ఎంతో చక్కగా అర్థమయ్యే రీతిలో అలరించారని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం 25 వేల రూపాయలు మల్లేషం విరాళంగా ఇచ్చారని అందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్య ఎంత ముఖ్యమో విద్యార్థులకు మౌలిక వసతులు కూడా అంతే అవసరమని వెల్లడించారు. ముందస్తుగా గణిత దినోత్సవం సందర్భంగా గణితమేళా, క్విజ్ నిర్వహించామని, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఈ వేడుకలలో ఉత్సాహంగా పాల్గొనడం జరిగిందని తెలిపారు.



# రాజ్యాంగ విలువల కోసం రాహుల్ గాంధీ పోరాటం

- అమిత్ షా వ్యాఖ్యలు బిజెపి అహంకార ధోరణికి నిదర్శనం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

**సంగారెడ్డి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** బీజేపీ అహంకారపు, బాధ్యతారాహిత్య రాజకీయాలు చేస్తోందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి విమర్శించారు. దేశం ఉన్నంతకాలం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దేశ ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో భారీ ర్యాలీ నిర్వహించబడింది. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ అమిత్ షా తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్‌ను గౌరవించిన కాంగ్రెస్, అవమానిస్తున్న బీజేపీ జగ్గారెడ్డి మాట్లాడుతూ అంబేద్కర్‌ను గొప్ప మేధావిగా గుర్తించి గౌరవించింది కాంగ్రెస్ పార్టీ అని, మరోవైపు బీజేపీ ఆయనను అవమానిస్తోందని తెలిపారు. అంబేద్కర్ జపం ఫ్యాషన్ అయిందని అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బాధ్యతా రాహిత్యానికి పరాకాష్టని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ విలువల కోసం రాహుల్ గాంధీ పోరాటం రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, భారత్ న్యాయ యాత్రలతో రాజ్యాంగ విలువలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నారని జగ్గారెడ్డి ప్రశంసించారు. రాహుల్ గాంధీ పట్ల బీజేపీ కుట్రలు చేస్తున్నట్లు ఆరోపించారు. అంబేద్కర్‌కు కాంగ్రెస్ ఇచ్చిన గౌరవం తొలి పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ, అంబేద్కర్‌ను న్యాయశాఖ మంత్రిగా నియమించి, రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలు అప్పగించడం ద్వారా కాంగ్రెస్ ఆయనకు గౌరవం చూపిందని జగ్గారెడ్డి గుర్తు చేశారు. అమిత్ షా రాజీనామా చేయాలి. బీజేపీ అహంకారానికి అమిత్ షా వ్యాఖ్యలు ఉదాహరణగా నిలుస్తాయని, ఆయన వెంటనే రాజీనామా చేయాలని జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువల కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. ఈ దేశం ఉన్నంత కాలం అంబేద్కర్ పేరు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా ఉంటుందని జగ్గారెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




# రంగాపురంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే

### లబ్ధిదారులు దళారులను నమ్మి మోసపోవద్దు



**పెబ్బేరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పెబ్బేరు మండలం రంగాపురం గ్రామంలో గ్రామ పంచాయితీ కార్యదర్శి ప్రదీప్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను శనివారం రంగాపురం కాంగ్రెస్ నాయకులు పంచాయతీ కార్యదర్శి ప్రదీప్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లబ్ధిదారులు ఎవరు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. డిసెంబర్ 31 వరకు సర్వే కొనసాగుతుందని అనంతరం ఎమ్మెల్యే మేఘారెడ్డి, రంగాపురం కాంగ్రెస్ నాయకులు బి.రాంచంద్రారెడ్డి సహకారంతో గ్రామంలో అర్హత ఉన్న లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని వారు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కావలి చిన్నోడు, గొడుగు పెద్ద ఎల్లస్వామి,బాపనపల్లి రమేష్, మడ్డి ఎల్లస్వామి, చింతకాయల నరసింహ,బొగ్గు కృష్ణయ్య,సలీం తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యం పదిలం

### ప్రధానోపాధ్యాయులు సాజిదా బేగం




**తాండూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పోషక విలువలు కలిగిన ఆహారం తింటేనే మనిషి ఆరోగ్యంగా ఉంటాడని ప్రధానోపాధ్యాయులు సాజిదా బేగం వెల్లడించారు. విద్యాధికారుల ఆదేశాల మేరకు బషీరాబాద్ మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు సాజిదా బేగం ఆధ్వర్యంలో ఆహారోత్సవం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం ప్రాముఖ్యతను స్పష్టంగా వివరించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని చిన్నారులకు అందించి, ఆరోగ్యవంతమైన పిల్లలుగా ఎదగాలనే సదుద్దేశంతో విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించడానికే ఈ ఆహారోత్సవాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సమక్షంలో విద్యార్థులు అహారోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని వివరించారు. జంక్ ఫుడ్, ఫాస్ట్ ఫుడ్ తినడం వల్ల పిల్లల్లో కలిగే అనారోగ్య పరిణామాలను వివరించారు. మన పూర్వీకులు పాటించే పురాతన ఆహార పద్ధతులు చాలా శ్రేష్టమైనవని స్పష్టం చేశారు. జొన్నలతో చేసే ఆహార పదార్థాలు, రాగులు, చిరుధాన్యాలు తో చేసే ఆహార పదార్థాలు ఆరోగ్యం తోబాటు పిల్లల ఎదుగుదలకు కావలసిన పరిపూర్ణమైన పోషకాలు లభిస్తాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ సలిమున్నిస, ఉపాధ్యాయులు శేషగిరి, సాదియా నౌషీన్, అఫ్రీన్ ఫాతిమా, అయేషా సమీరా ఉన్నత బాలుర పాఠశాల ఉపాధ్యాయులు నాగరాజు, సుగంధి. రవికుమార్, సులేమాన్, బ్రిలియంట్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజశేఖర్, మల్హారి రావు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# సూత్రాలను నేర్చుకుంటే సులభంగా గణితం



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** సూత్రాలను నేర్చుకుంటే సులభంగా గణితం చేయవచ్చని గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ శివరామిరెడ్డి అన్నారు. స్థానిక గీతాంజలి హైస్కూల్ లో శనివారం శ్రీనివాస రామానుజన్ 137వ జయంతి సందర్భంగా గణిత దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. శ్రీనివాస రామానుజన్ గణితంకు చేసిన సేవలను వివరించారు. విద్యార్థులు రూపొందించిన గణిత నమూనాలు, త్రికోణమితి, చతుర్భుజాలు, సంఖ్యాకశాస్త్రం, బీజగణితాలు తదితర నమూనాల ప్రదర్శనలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ శ్రేయారెడ్డి, హెడ్మాస్టర్ సూర్యకుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి

### విద్యార్థులకు బహుమతులు అందజేసిన డిఎస్పీ భక్తవత్సలం




**ప్రొద్దుటూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని డీఎస్పీ భక్తవత్సలం సూచించారు. శనివారం కొర్రపాడు రోడ్డులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం ఐ.పి.ఎస్.జి.ఎం 2024 బాలుర జిల్లా స్థాయి ఆటల పోటీలు ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రొద్దుటూరు డిఎస్పీ భక్తవత్సలం, ఆర్.సి.పి.ఈ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా విచ్చేసి క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ భక్తవత్సలం మాట్లాడుతూ విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని సూచించారు. క్రీడల వల్ల మంచి ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. కావున విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. క్రీడల వలన గెలుపోటములను సమానంగా స్వీకరించే భావన అలవరుతుందని వివరించారు. కాగా ఈ క్రీడలలో వ్యక్తిగత విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ గా గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రొద్దుటూరు కళాశాల, క్రీడల విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ గా లయోలా పాలిటెక్నిక్ పులివెందుల విద్యార్థులు సాధించారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ జింక అశోక్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

# అమిత్ షాను భర్తరఫ్ కోసం దళిత సంఘాల డిమాండ్



**ధర్మపురి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను పార్లమెంట్ నిండు సభలో అవమానించి, హేళన చేసిన కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా ను పార్లమెంట్ నుండి వెంటనే భర్త రఫ్ చేయాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి దళిత సంఘాల ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఈ భారతదేశానికి అత్యున్నతమైన రాజ్యాంగాన్ని అందించి అందరికీ సమాన హక్కులను కల్పించిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను అమిత్ షా విమర్శించడం తగదని అన్నారు. ఆయన వెంటనే ఈ దేశంలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ కేంద్ర మంత్రి మండలి నుంచి అమిత్ షాను తప్పించాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ ఆశయాలను కొనసాగించుటకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సూచించారు. ఆ మహనీయున్ని ఎవరు విమర్శించిన ఉపేక్షించబోమని ఈ సందర్భంగా తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెంటనే దళిత బహుజనుల జాతులందరికీ క్షమాపణ చెప్పాలని లేని ఎడల రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దళిత, బహుజన నాయకులు మాజీ ఎంపీటీసీ కాంపల్లి చంద్రశేఖర్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాడే సూర్యనారాయణ,మాజీ విఎస్ఎస్ చైర్మన్ దేవి జనార్ధన్,తెలంగాణ మాదిగ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సుంచు మల్లేశం,జిల్లా కో కన్వీనర్ లు బొల్లి నందయ్య, పెరుక బానేష్,మాల సంఘం మండల జేఏసీ కన్వీనర్ ఓరెమ్ చిరంజీవి,నేతకాని మెహర్ కుల సంఘం మండల అధ్యక్షుడు రాగుల మల్లేశం, ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్చార్జ్ శనిగారపు మల్లేశం, ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ మద్దునాల మల్లేశం,తెలంగాణ మాదిగ ఐక్యవేదిక మండల అధ్యక్షుడు దూడ సురేష్, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఏదుల్ల అంజయ్య, వికలాంగుల హక్కుల పోరాట సమితి మండల అధ్యక్షుడు గంగయ్య, నేతికాని మహర్ కుల సంఘం మండల ప్రధాన కార్యదర్శి గోగు దేవేందర్,నాయకులు ఏదుల్ల ప్రభాకర్,సుంచు ప్రశాంత్,బొల్లి సూర్య చరణ్, జేరిపోతుల శ్రీకాంత్,రెడపాక పోచయ్య, జూంజిపల్లి బాపు,గంధం ప్రశాంత్,దేవి అరవింద్, వాల్మీకి బోయ కుల సంఘం గ్రామ శాఖ నాయకులు సాగల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు



**బెల్లంకొండ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మండల కేంద్రంలోని బెల్లంకొండ మెయిన్ సెంటర్ లో మాజీ సీఎం వైయస్.జగన్ మోహన్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. వైసీపీ శ్రేణులు కేక్ కట్ చేశారు. అనంతరం గ్రామ పార్టీ అధ్యక్షుడు బడా బచ్చ ,సచివాలయ కన్వీనర్ మౌలాలి ఆధ్వర్యంలో అన్నదానాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి చందర్ రెడ్డి, కో ఆప్షన్ నెంబర్ దరియా,గడ్డి పర్తి చిన్నబాబు, వైఎస్ఆర్సిపి నాయకులు పి ఎస్ కే మౌలాలి, గ్రామ పార్టీ అధ్యక్షుడు బడబచ్చ,మాజీ సొసైటీ చైర్మన్ భద్రయ్య పెద్ద ఎత్తున వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు.

# సిపిఐ(ఎం) జిల్లా సభ్యులుగా పుల్లయ్య

### అశ్వారావుపేట నుండి జిల్లా కమిటీకి ఇరువురు ఎన్నిక





**అశ్వారావుపేట, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** గత రెండు రోజులుగా ఇల్లందులో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా 3వ జిల్లా మహాసభలు శనివారంతో విజయవంతంగా ముగిసాయి. జిల్లా కార్యదర్శిగా మచ్చ వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నిక అవగా అశ్వారావుపేట మండలం నుండి ఇరువురు జిల్లా కమిటీకి ఎంపికయ్యారు. జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు గా కొక్కెరపాటి పుల్లయ్య,జిల్లా కమిటీ సభ్యులుగా బి.చిరంజీవి తిరిగి ఎన్నికయ్యారు. జిల్లా కమిటీ ఎన్నికైన వీరికి పార్టీ మండల కార్యదర్శి సోడెం ప్రసాద్,మండల కార్యదర్శి వర్గం ముల్లగిరి గంగరాజు,మడకం గోవిందు,మడిపల్లి వెంకటేశ్వరరావు, కారం సూరిబాబు, తగరం నిర్మల స్థానికంగా గల పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు,అధికారులు అభినందనలు తెలిపారు.

# ప్రొద్దుటూరులో మాజీ సీఎం జగన్ జన్మదిన వేడుకలు





**ప్రొద్దుటూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ప్రొద్దుటూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా స్థానిక రామేశ్వరం లోని శ్రీ హనుమత్ లింగేశ్వర స్వామి ఆలయంలో 32వ వార్డ్ కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న వైసీపీ శ్రేణులు జగన్ కు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆదిదేవున్ని వేడుకున్నారు. అనంతరం స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రిలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం థర్మల్ రోడ్డు లోని విశ్వ ప్రేమ వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అన్నదానం నిర్వహించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ శ్రేణులు జగన్ మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రొద్దుటూరు పట్టణంలో తాము హనుమత్ లింగేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించడంతో పాటు, గవర్నమెంట్ హాస్పిటల్ లో రోగులకు పండ్లు, బ్రెడ్డు అందజేశామని, విశ్వ ప్రేమ వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేయడం, అన్నదానం నిర్వహించామని వివరించారు. వైఎస్సార్ తనయుడని రాష్ట్ర వ్యాప్తంగా కార్యకర్తలు ఆయనను అక్కున చేర్చుకున్నారని, 40 సంవత్సరాల వయసులో పార్టీ స్థాపించి, 175 స్థానాలలో పోటీ చేయడంతో పాటు 63 స్థానాలతో బలమైన ప్రతిపక్ష పార్టీగా అడుగుపెట్టి, తరువాత కాలంలో 151 స్థానాలలో గెలిచారని స్పష్టం చేశారు. ప్రొద్దుటూరు వైసీపీ శ్రేణుల, ప్రజల సహకారంతో తాను ప్రతిపక్షంలో, అధికార పక్షంగా అసెంబ్లీలో అడుగిడినట్లు వివరించారు. పేదరిక నిర్మూలనకు, వ్యవసాయ రంగానికి, విద్య కోసం ఎన్నో వినూత్న పథకాలు అమలు చేసిన ఘనత ఆయనదే అని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు జగన్ గెలిచి వుంటే తమకు ప్రతి నెలా ఏదో ఒక పథకం ద్వారా నగదు అందేదని ఆవేదన వెలిబుచ్చుతున్నారన్నారు. ఇంతటి జనాదరణ ఎన్టీఆర్, వైఎస్ఆర్ తర్వాత జగన్ కే దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, జడ్పీ ఛైర్మన్ జేష్టాది శారద, మున్సిపల్ ఛైర్మన్ భీముని పల్లె లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి, కౌన్సిలర్లు గుర్రం లావణ్య, గరిశపాటి లక్ష్మిదేవి, మన్నె సత్యం, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, పాతకోట ముని వంశీధర్ రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ మల్లికార్జున యాదవ్, పట్టణాధ్యక్షురాలు కోనేటి సునంద, వైసీపీ నాయకులు భీముని పల్లె నాగరాజు, బండారు సూర్యనారాయణ, రాగా నరసింహారావు, యాలం శంకర్, గోనా ప్రభాకర్ రెడ్డి, మహిళా నాయకురాళ్ళు కళావతి, పార్వతీ, లక్ష్మిదేవి, నాయకులు నల్లదేశి జంగమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సఫాయి కార్మికుల రక్షణకు నిర్దిష్ట చర్యలు

## జాతీయ కమిషన్ చైర్మెన్ ఎం వెంకటేశన్

**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** మహిళా సఫాయి కర్మచారీల కోసం అంతరంగిక కమిటీలను ఏర్పాటు చేసి వారికి ఏమైన వేధింపులు, సమస్యలు ఉంటే వెంటనే కమిటీల ద్వారా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ ఎస్సీ, ఎస్టీ, సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం.వెంకటేసన్ తెలిపారు. శనివారం మేడ్చెల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ లో సఫాయి కర్మచారి జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి హాజరైన జాతీయ సఫాయి కర్మచారి కమీషన్ ఛైర్మన్ ఎం .వెంకటేసన్ ను జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా కమీషన్ ఛైర్మన్ మాట్లాడుతూ సఫాయి కర్మచారీలు ఏవైన సమస్యలు ఉంటే ముందుగా అధికారులకు తెలియజేయాలని, సమస్యలు పరిష్కారం కాకుంటే యూనియన్ వారి దృష్టికి తేవాలని అక్కడ కూడా పరిష్కారం కాకుంటే కమీషన్ కు ఫోన్ చేసి తెలిపాలని కమీషన్ ఫోన్ నంబరు 01124648924 ను సభా ముఖంగా



సఫాయి కర్మచారీలకు తెలిపారు. జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీ సఫాయి కర్మచారీలను వేదిక వద్దకు పిలుచుకొని వారికి జీతం సరిగా వస్తుందా, ఏమైనా కోతలు విధిస్తున్నారా అని అడిగి వారి ఫోన్లలో జీతం పడిన తేదీలను జీతం మొత్తాన్ని పరిశీలించారు. కొంతమంది కర్మచారీలకు తక్కువ జీతం పడడంతో సదరు మున్సిపల్ కమీషనర్ ను వివరాలను ఛైర్మన్ అడిగి తెలుసుకున్నారు. సఫాయి కర్మచారీలకు యూనిఫాం, ఐడి కార్డులు, నెలలో 4 రోజుల సెలవులు వంటి వారి హక్కులను తెలియజేస్తూ, నెలకొకసారి వారిని కలుసుకొని సమస్యలను తెలుసుకోవాలని ఛైర్మన్ లేబర్ కమీషనర్ ను ఆదేశించారు. అంతే కాకుండా వారికి సబ్బులు, నూనే, గ్లౌజుల వంటి కనీస అవసరాలు అందిచాలని అధికారులకు సూచించారు. మానిటరింగ్ కమీటి సభ్యులు సఫాయి కర్మచారీల సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారించేందుకు కృషి చేయాలన్నారు. సఫాయికర్మచారీలకు పిఎఫ్,ఈఎస్ఐ ఖాతాలలో విధిగా జమ చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సఫాయి కర్మచారీలకు ఏలాంటి ఇబ్బందులు కలిగించకుండా వారికి మర్యాద గౌరవం అందిస్తూ పనులు చేయించాలని అధికారులకు కమీషన్ ఛైర్మన్ సూచించారు. ఈ సమావేశంలో అధిక సంఖ్యలో సఫాయి కర్మచారీలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇంఛార్జి ఆర్డిఓ శంకర్ కుమార్, ఎస్సీ కార్పొరేషన్ ఈడి మోసిస్ బాబు, సంబంధిత అధికారులు, సఫాయి కర్మచారీలు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం

## పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



**బెల్లంకొండ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన బెల్లంకొండ, అచ్చంపేట మండలాల పేదలకు ముఖ్యమంత్రి సహానిధి ద్వారా మంజూరైన చెక్కులను పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సిఫారసు లేఖ ద్వారా 6 మందికి మంజూరైన 5,69,736 రూపాయల చెక్కులను పెదకూరపాడు నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం అందించి చంద్రబాబు పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నారన్నారు. అర్హులైన పేదలకు చెక్కులను పంపిణీ చేయడంతో పాటు కూటమి ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ప్రభుత్వం అందించే సహాయాన్ని పొందిన పేదలు తమ ఆరోగ్యాన్ని భద్రంగా చూసుకోవాలన్నారు. పేదలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుడిసె కొండయ్య కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు చేరువైన ప్రభుత్వ వైద్య సేవలు

## జిల్లా వైద్యాధికారి డాక్టరు వెంకటరమణ



**వికారాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి 108 నెంబర్ వాహనాలను ప్రభుత్వం అందుబాటులోకి తేవడం జరుగుతుందని జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ వెల్లడించారు. రిబ్బన్ కట్ చేసి 108 నెంబరు గల రెండు అంబులెన్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా పాలన అధికారి ఆదేశానుసారం 108 నెంబరు గల రెండు అంబులెన్సును ప్రారంభించడం జరిగిందని పేర్కొన్నారు. బొంబరోస్పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, దౌల్తాబాద్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఈ రెండు వాహనాలను కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కార్యాలయ సిబ్బంది, 108 వాహన సిబ్బంది, పాల్గొన్నారు.

# వివాహ పరిచయ వేదిక కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభం

## ఏపీ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య పిలుపు



**తిరుపతి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** బైరాగిపట్టెడలోని శ్రీ వైఖానస కళ్యాణ వేదిక నందు ఫిబ్రవరి 16 వ తేదీ బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య మరియు తిరుపతి బ్రాహ్మణ సమాజం వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు బ్రాహ్మణ పెద్దలు నరసింహాచార్య, హరిప్రసాద్, మహేష్ లు పిలుపునిచ్చారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా ముందు వీరు మాట్లాడుతూ జనవరి 30 తేదీ లోపు రిజిస్టర్ చేసుకున్న వారి ఫోటోలను నూతన వధూవరుల పుస్తకంలో ప్రచురిస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకుని, ఫిబ్రవరి 16వ తేదీ వధూవరుల పరిచయాల కార్యక్రమంలో పాల్గొని, జంటలుగా మారాలని ఆశీర్వదించారు. అలాగే షష్టిపూర్తి, భీమరథ శాంతి మహోత్సవాలను బ్రహ్మణ బంధువులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9030177388, 9390427018 లకు సంప్రదించాలన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బ్రాహ్మణ సమాజం నాయకులు బీమాస్ అశోక్ వేదం హరి ప్రసాద్ వెంకట పెరుమాళ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు కన్నీరు మిగిల్చిన తుఫాన్

## ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



**శ్రీకాకుళం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షాలకు వరి పంట తడిచి రైతులకు కష్టాలు కన్నీరు మిగిల్చిందని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.టెక్కలి మండలంలో తేలినీలాపురం గ్రామంలో ఇటీవల కాలంలో తుఫాన్ ప్రభావం వలన రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, మాధురి వెళ్లి రైతులు పడుతున్న కష్టాలను కళ్ళారా చూసారు. దువ్వాడ శ్రీనివాస్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ధాన్యం కోతలు కోసిన వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేసుంటే ఈ దుస్థితి వచ్చుండేది కాదని ఆరోపించారు. ఇటీవల కాలం లో పది రోజుల క్రితం రైతులు పడుతున్న కష్టాలను చూసి ప్రభుత్వం దృష్టికి, జిల్లా కలెక్టర్ కి విన్నవించడం జరిగిందని అన్నారు.కానీ కనీసం పట్టించుకోక పోవడం వలన నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ధాన్యం తడిసిపోయి కొనడానికి వీలుకాని విదంగా ఉన్నాయని అన్నారు.ఈ దాన్యాన్ని కొనుగోలు చేయకపోవడం వలన ఈ దుస్థితి జరిగింది అంటే పరదాలు ఇవ్వలేదు,తుఫాన్ సెల్టర్ కు షిఫ్ట్ చెయ్యలేదు,తుఫాన్ హెచ్చరికలు తెలియజేస్తూ కూడా ముందస్తు చర్యలు తీసుకోకపోవడం వలన జరిగిన నష్టానికి ఈ దాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పోలాకి లక్ష్మి,వైస్ ఎంపీపీ పేరాడ రమేష్, జేసీయస్ మండల ఇంచార్జ్ శిగిలిపల్లి మోహన్,వైసీపీ నాయకులు ఆంజనేయులు, వైకుంఠ రావు,కార్యకర్తలు,రైతులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

**గన్నవరం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** గన్నవరంలోని వైసిపి నియోజకవర్గం కార్యాలయంలో గన్నవరం జడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి అధ్యక్షతన మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి 52వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వై ఎస్ రాజ శేఖర్ రెడ్డి తనయుడు జగన్ మోహన్ రెడ్డి గత ఐదు సంవత్సరాలు పేదలకు మంచి పరిపాలన అందించరని, ఎవరికి హాని చేయలేదని తండ్రి లాగానే జగన్ మోహనరెడ్డిని, పేదల దేవుడిగా చేస్తున్నారని అన్నారు. అలాగే మన గన్నవరం నియోజకవర్గం మాజీ యం ఎల్ ఏ వల్లభనేని వంశీ మోహన్ పై ప్రజలలో నేటికీ దానకర్ణుడుగా భావిస్తున్నారని ఆమె అన్నారు. వారు చెడు తో ఓడిపోలేదని ఇప్పటికి వారు ప్రజల హృదయాలలో ఉన్నారని ఆమే అన్నారు. ప్రస్తుతం కొంత నిర్భందాలలో పార్టీ ఉందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల మీద భారం వేయకుండా సంపద సృష్టించి పారిపాలన చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారు. కానీ సంపద లేకుండా ప్రజలపై భారం వేయటానికి సిద్ధంగా ఉన్నారని, దానిని మనం ప్రతిఘటించాలని హాజరైన అందరికి విజ్ఞప్తి చేసారు. ఇంత నిర్భందంలో కూడా భయపడకుండా ఇంత మంది హాజరైన మీ అందరిని అభినందిస్తున్నానని ఆమే అన్నారు. ఈ కార్యక్రమంలో గన్నవరం మండల



వైస్ యం పి పి సాతులూరి నాగరాజా కుమారి, ఎంపీటీసీ దూడ్ల స్వర్ణ, తిరివిది రవి, వైసిపి జిల్లా మహిళా కార్యదర్శి సురెడ్డి మాణిమ్మ, నాయుకులు నరసింహ రెడ్డి, సామల ఆంజనేయులు, మర్లపాలెం అంజనేయులు పలు అంశాలపై ప్రశంగించారు. అనంతరం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు సేవా కార్యక్రమాలు పిలుపు లో భాగంగా పేదలకు చలికాలంలో దుప్పట్లు, పంపిణి చేశారు. స్వీట్ కేక్ ను నాయకులు కట్ చేసి జగన్ మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదరికమే గీటురాయిగా ఇందిరమ్మ ఇళ్లకు ఎంపిక

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**కల్లూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** పేద ప్రజల సొంతింటి కల ఇందిరమ్మ ఇంటి నిర్మాణంతో తీరుతుందని, పేదరికమే గీటురాయిగా ఎంపిక ఉంటుందని రాష్ట్ర రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సత్తుపల్లి నియోజకవర్గం కల్లూరు పట్టణంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో ఇందిరమ్మ మోడల్ హౌస్ నిర్మాణానికి శనివారం భూమి పూజను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డితో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ పేదవాడి చిరకాల సొంత ఇల్లు కోర్కెను తీర్చడానికి ఇందిరమ్మ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.విడతల వారీగా నాలుగు లక్షల 50 వేల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఇందిరమ్మ మోడల్ హౌస్ ని ప్రతి మండలంలో నిర్మిస్తామని,రాష్ట్ర వ్యాప్తంగా రాబోయే నాలుగేళ్లలో 20 లక్షల ఇళ్లు నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలనలో కోటి ఐదు లక్షల అప్లికేషన్స్? రాగా ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం 80 లక్షల మంది అప్లై చేశారన్నారు. ఇళ్ల నిర్మాణం కోసం 17,734 మందిని ఆన్లైన్ యాప్ ద్వారా వివరాలను సేకరించగా మిగతా వారివి త్వరలోనే సేకరించి సర్వే పూర్తయిన వెంటనే ప్రాధాన్యత క్రమంలో ఇళ్ల నిర్మాణం చేపడతామని చెప్పారు. అలాగే సత్తుపల్లి, పాలేరు నియోజకవర్గాల అభివృద్ధికి కృషి చేస్తానని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 63 వేల ఇళ్లు ఇస్తే సత్తుపల్లి నియోజకవర్గంలో 537 ఇళ్ల నిర్మాణం చేపట్టగా అవి



అసంపూర్తిగానే నిలిచిపోయాయని తెలిపారు.కేసీఆర్ కు రాష్ట్ర అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని, అసెంబ్లీకి రాకుండా ఫామ్ హౌస్ కు పరిమితమవుతున్నాడని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ను అరెస్టు చేస్తే రాష్ట్రాన్ని అగ్నిగుండంగా మార్చేందుకు బీఆర్ఎస్ నాయకులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. గతంలో ధరణి పోర్టల్ తో అభద్రతాభావం ఉండేదని, భూ భారతి కొత్త రెవెన్యూ చట్టం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెరుగుతందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ చైర్మన్ మువ్వ విజయ్ బాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ దయానంద విజయ్ కుమార్, కల్లూరు ఆర్డీఓ రాజేందర్ గౌడ్, స్థానిక తహశీల్దార్, ఎంపీడీఓ, పలువురు ప్రభుత్వ ఉన్నతాధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగుల క్రమబద్ధీకరణకు నిరవధిక సమ్మె

**ఖమ్మం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలంటూ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం ఖమ్మం నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రం నుండి జడ్పీ సెంటర్ వరకు భారీ ర్యాలీనీ నిర్వహించారు.అనంతరం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగసంఘం జిల్లా అధ్యక్షులు షేక్ మహబూబ్ పాషా ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ సౌజన్య మాట్లాడుతూ,టీ తాగే లోపు సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఒక్క సంతకంతో వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికలకు ముందు రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీ కప్పులు పట్టుకొని నినాదాలు చేశారు.సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేపట్టిన నాటి నుండి నేటి వరకు ఇద్దరు ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని అయినా కాంగ్రెస్ ప్రభుత్వానికి నిమ్మకు నీలెత్తినట్లు వ్యవహరిస్తుందని మండిపడ్డారు.తక్షణమే సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి వారి సమస్యలను




పరిష్కరించాలని కోరారు.ఈ నిరసన ర్యాలీలో పాల్గొన్న టి పి టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి విజయ్ , కిషన్ నాయక్ పూర్తి మద్దతు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వీరాస్వామి అడిషనల్ జనరల్ సెక్రటరీ అనిల్ ఉపాధ్యక్షులు సాంబశివరావు,ఇస్మాయిల్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ నిర్మల,జిల్లా మహిళా అధ్యక్షురాలు విజయ లక్ష్మి, కోశాధికారి రాణి, కార్యదర్శులు కృష్ణ ప్రసాద్ ,సురేష్ ,భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

# అంబేద్కర్ ను అవమానించినోళ్లు రాజ్యాంగ ద్రోహులు

## రాజ్యాంగాన్ని మార్చేయత్నంలోనే బీజేపీ: బాగం

## సిపిఐ ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా మాటాల వెనుక మతోన్మాధ కుట్ర దాగి వున్నదని రాజ్యాంగ నిర్మాతను అందుకే అవమానించారని సి.పి.ఐ.జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు ఆరోపించారు.భారత రాజ్యాంగాన్ని మార్చే బీజేపీ కుట్రలో భాగంగానే ఈ తంతు జరిగిందని ఆయన తెలిపారు. పార్లమెంట్ లో అంబేద్కర్ ను నిందిస్తూ అమిత్ షా మాట్లాడిన మాటలను నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో శనివారం అమిత్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.సి.పి.ఐ కార్యాలయం నుండి ప్రదర్శనగా బయలుదేరి స్థానిక బైపాస్ రోడ్ లో దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.అమిత్ షా రాజీనామా చేయాలని, బీజేపీ మతోన్మాదం నశించాలని నినదించారు.ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ,బీజేపీ మొదటి నుంచి భారత రాజ్యాంగాన్ని మార్చేయాలని ప్రయత్నిస్తున్నదని అందులో బాగంగానే భారత రాజ్యంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు.భారత రాజ్యాంగాన్ని ఏనాడు గౌరవించని ఆర్.ఎస్.ఎస్., బీజేపీ ఇప్పుడు ఏకంగా రాజ్యాంగాన్ని మార్చడం నియంత పాలనవైపు అడుగులేస్తుందన్నారు.జమిలీ ఎన్నికల ప్రతిపాదన, షా మాటలు బీజేపీ ధోరణికి అద్దంపడుతున్నాయన్నారు. రాజ్యాంగ విలువలకు తిలోదకాలిచ్చి శాశ్వతంగా భారతదేశాన్ని పరిపాలించాలన్న ఆలోచనలో బీజేపి ఉన్నదని బీజేపి ఆటలు సాగనివ్వబోమని హేమంతరావు హెచ్చరించారు. హెూం మంత్రి ఆమీత్ కు కేంద్ర మంత్రి వర్గంలో కొనసాగే నైతిక హక్కులేదన్నారు. జమిలీ ఎన్నికలు ఈ దేశ సార్వభౌమత్వానికి ప్రజా స్వామ్యానికి అతి పెద్ద ముప్పుగా



పరిణమించనున్నాయని ఆయన తెలిపారు. ఇప్పటికే దేశ ప్రజల మధ్య విభజన తీసుకొచ్చి మెజార్టీ, మైనార్టీ మతాల ప్రాతి పదికన రాజకీయ లబ్ది పొందేందుకు బీజేపి ప్రయత్నిస్తుందని ఒకసారి రాముడు,మరోసారి మతం ఇలా ఏదో ఒక వాదాన్ని ముందుకు తెచ్చి లబ్ది పొందుతుందన్నారు. అమిత్ ను సమర్థిస్తున్న ప్రధాని మోడీ, రాజ్యాంగ ద్రోహిగానే పరిగణించవలసి వస్తుందని హేమంతరావు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్,రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి,యర్రాబాబు, ఎస్.కె. జానిమియా, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగునర్సింహారావు, పోటు కళావతి, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, సి. హెచ్. సీతామహాలక్ష్మి, రావి శివరామకృష్ణ, తోట రామాంజనేయులు, మిదికంటి వెంకటరెడ్డి, పగడాల మల్లేష్,మేకల శ్రీనివాసరావు,ప్రజా సంఘాల బాధ్యులు తాటి నిర్మల,ఇటికాల రామకృష్ణ, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, ఎస్.కె. సైదా, యడ్లపల్లి శంకరయ్య, శివ, సురేందర్, మల్లిఖార్జున్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ బలోపేతానికి బూత్ అధ్యక్షులు కృషి చేయాలి

## ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



**నాచారం, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ఉప్పల్ నియోజకవర్గం నాచారం డివిజన్ పరిధిలో పోతగాని గోపాల్ గౌడ్ శక్తి కేంద్ర ఇంచార్జ్ గా పండిట్ దీన్ దయాళ్ శక్తి కేంద్ర బూత్ కమిటీ సమావేశానికి ముఖ్యఅతిథిగా బిజెపి రాష్ట ఉపాధ్యక్షులు, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా బూత్ 224 అధ్యక్షులు క్రాంతి కుమార్,బూత్ 226 అధ్యక్షులు కటికాల శ్రీనివాస్ యాదవ్ లను సన్మానించి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి, విజయానికి బూత్ అధ్యక్షులు తోడ్పడాలని, బూత్ అధ్యక్షులదే ప్రధమ భాద్యతని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిధులు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ను శాలువాతో మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి,శక్తికేంద్ర ఇంచార్జ్ పోతగాని గోపాల్ గౌడ్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి రవి నాయక్, డివిజన్ అధ్యక్షుడు ప్రకాష్,డివిజన్ ఇంచార్జ్ ఎన్నికల చెంద్రమౌళి, శ్రీధర్ రెడ్డి, మోహన్ రెడ్డి,అనితా రెడ్డి, మంజుల వాణి, పోతగాని విజయలక్ష్మి, కమిటీ సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు,కాలనీ వాసులు పాల్గొన్నారు.

# కేరళ గ్లోబల్ హైస్కూల్లో ప్రపంచ ధ్యాన దినోత్సవం



**వేములవాడ, డిసెంబరు 21 (నిఘా న్యూస్):** వేములవాడ డివిజన్ లోని రుద్రాంగి మండలంలో డిసెంబర్ 21వ తేదీన ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా రుద్రంగి మండలకేంద్రంలోని కేరళ గ్లోబల్ హైస్కూల్లో పిల్లల చేత రకరకాల ధ్యానాలు చేపించారు. అనంతరం ధ్యానం చేయడం వల్ల కలిగే ఉపయోగాల గురించి విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ బాబు నంబియార్ మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయాన్నే ధ్యానం మెడిటేషన్ చేయడం వల్ల మనం ఆరోగ్యావంతంగా ఉంటామని అన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ధ్యానం చేయడాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని అన్నారు. ధ్యానం అన్ని సమస్యలకు నివారిణి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతిక, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆశ కార్యకర్తలకు అయోడిన్ పై అవగాహన



**వేములవాడ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ భవనంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా చందుర్తి, ఎల్లారెడ్డిపేట మండలాల ఆశ కార్యకర్తలకు రెండురోజుల అవగాహన కార్యక్రమం నిర్వహించనైనది ఇట్టి కార్యక్రమంలో డాక్టర్ అనంతప్రకాష్ ఎయిమ్స్ గుంటూరు వారు మాట్లాడుతూ ఐరన్, అయోడిన్ లోపం ద్వారా యుక్తవయస్సు మహిళల్లో, పిల్లల్లో మందబుద్ధి, శారీరక ఎదుగుదల లోపిస్తుందని, గాయిటర్, థైరాయిడ్ వంటి రుగ్మతలు వస్తాయని అందుకు, ప్రజలు అయోడిన్ ఉన్న సీ ఫుడ్ అయినటువంటి చేపలు, రొయ్యలు, కూరగాయలు, పాలు, నాణ్యమైన పౌష్టిక ఆహారం, మంచి భోజనం తీసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా, ఇన్స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్ మెంట్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ రాజశేఖర్, మండల కోఆర్డినేటర్లు బాబు, సంగీత, లక్ష్మణ్, రమ్య తిరుపతి, రెండు మండలాల ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# నరసయ్య గూడెంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు



**వలిగొండ, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నరసయ్య గూడెం గ్రామంలో క్రిస్మస్ వేడుకలలో భాగంగా ప్రేమ విందు కార్యక్రమం నర్సాయగూడెం చర్చి ఫాదర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీఎన్ రెడ్డి, బిజెపి యువ నాయకులు చిట్టెడి అభితేజ్ రెడ్డి ఈ క్రిస్మస్ ప్రేమ విందు కార్యక్రమంలో పాల్గొని కేక్ కట్ చేసి నరసయ్యగూడెం గ్రామ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్సెంటివ్ జోజప్ప, నరసయ్య గూడెం గ్రామ ప్రజలు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో స్మార్ట్ సిటీ పనులు నిలిపివేత..!

- స్మార్ట్ సిటీ నిధుల దుర్వినియోగంపై చర్యలు ఏవి..?
- గుండె మీద చేయి వేసుకుని చెప్పండి, కరీంనగర్ స్మార్ట్ గా కనబడుతుందా
- అధికారుల అవినీతి తో స్మార్ట్ సిటీ అక్రమార్కుల పాలైంది.
- స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై ఎప్పుడైనా సమావేశం నిర్వహించారా..?
- మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించిన కార్పొరేటర్ శ్రీదేవి



**కరీంనగర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కేంద్ర ప్రభుత్వం మంచి ఆలోచనతో కరీంనగర్ ను స్మార్ట్ సిటీగా ఎంపిక చేస్తే, పనులన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయాయి. అసలు కరీంనగర్ స్మార్ట్ సిటీగా కన్పిస్తోందా. మీ గుండె మీద చేయి వేసుకుని చెప్పండని కార్పొరేటర్ వంగల శ్రీదేవి శనివారం జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో ప్రశ్నించారు. సమావేశంలో కార్పొరేటర్ శ్రీదేవి అనేక అంశాలను లేవనెత్తి మాట్లాడారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల స్మార్ట్ సిటీ పథకం పూర్తిగా అక్రమాల పరమైందని, స్మార్ట్ సిటీ పనులన్నీ ఎక్కడిక్కడ ఆగిపోయాయన్నారు. కరీంనగర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల నిధులు ఒకరేమో సీడీఎఫ్ నిధులంటారు. ఇంకొకరేమో స్మార్ట్ సిటీ ఫండ్స్ అంటారని, అసలు స్మార్ట్ సిటీ స్కీం కింద ఎన్ని నిధులు కేటాయించారు. ఏయే పనులకు ఎంతెంత ఖర్చు చేశారు. వాటి పురోగతి ఏమిటో పూర్తి రిపోర్ట్ ఇవ్వాలన్నారు. స్మార్ట్ సిటీ పనుల్లో అక్రమాలు జరిగినట్లు అనేక వార్తలొచ్చాయని, బాధ్యులపై ఏం చర్యలు తీసుకున్నారన్నారు. అలాగే సీడీఎఫ్ నిధులు ఎన్ని మంజూరయ్యాయి. వాటిని ఏయే పనులకు వినియోగించారు. ఎంత ఖర్చు చేశారు. పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. ముఖ్యంగా స్మార్ట్ సిటీ పనుల పురోగతిపై ఎన్నడైనా కరీంనగర్ కార్పొరేటర్లతో సమావేశం నిర్వహించారా అని ప్రశ్నించారు. ఇకనైనా కార్పొరేటర్లకు బ్యాచ్ ల వారీగా స్మార్ట్ సిటీ, సీడీఎఫ్ నిధులు, పనుల పురోగతిపై ప్రత్యేక అవగాహన శిబిరం నిర్వహించాలని ఆమె ఈ సందర్భంగా కోరారు.

# కూకట్ పల్లిలో వైఎస్ జగన్ జన్మదిన వేడుకలు

- కూకట్ పల్లి వీధులలో భారీ బైక్ ర్యాలీ
- హాజరైన గుంటూరు జిల్లా వైసిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు జలగం రామకృష్ణ



**కూకట్‌పల్లి, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** సంక్షేమ పథకాల సారధి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలను శనివారం కూకట్‌పల్లిలో ఘనంగా నిర్వహించారు. కెపిహెచ్బి కాలనీలో శుక్రవారం రాత్రి గుంటూరు జిల్లా వైఎస్ఆర్సిపి ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు జలగం రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెసర్లంక రమణ ఆధ్వర్యంలో నిర్వహించిన జన్మదిన వేడుకలకు వైయస్సార్సీపి అభిమానులు కార్యకర్తలు పెద్ద సంఖ్యల హాజరై బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. పెద్ద ఎత్తున జగన్మోహన్ రెడ్డికి మద్దతుగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. గుంటూరు జిల్లా ట్రేడ్ యూనియన్ ఉపాధ్యక్షుడు రమణ మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి హయాంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అన్ని రంగాల్లో ఎంతో అభివృద్ధి సాధించిందన్నారు. అర్హులైన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు, రైతులకు అండగా నిలిచి రైతు భరోసాని అందించిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని ఆయన అన్నారు. విద్యా వ్యవస్థలో రూపురేఖలు మార్చి విద్యార్థులకు అమ్మ ఒడి, విద్యా దీవెన, ఫీజు రియంబర్స్మెంట్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు పరిచిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సైతం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి తెలంగాణ ప్రాంత ప్రజలు చూపిస్తున్న అభిమానానికి ఎంతో కృతజ్ఞతలని ఆయన పేర్కొన్నారు.

# ఏనుగు దాడిలో శంకరప్ప మృతి

**ఐదు లక్షల పరిహారం ప్రకటించిన ఎమ్మెల్యే**



**పలమనేరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** బైరెడ్డిపల్లి మండలం పాతపేట పంచాయితీ కుప్పనపల్లి గ్రామానికి చెందిన శంకరప్ప ఏనుగు దాడిలో మృతిచెందరం చాలా బాధాకరమని పలమనేరు శాసనసభ్యులు అమర్నాథ్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సమీపంలో పశువులను మేపుకుంటున్న శంకరప్పపై మదపటెనుగు దాడి చేయడంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే స్థానిక అధికారులు మరియు నేతలతో కలిసిపలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. శంకరప్ప మృతదేహాన్ని పరిశీలించి సంఘటనపై అటవీశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. మృతుడు శంకరప్ప వికలాంగుడు కావడంతో ఏనుగు భారీ నుంచి తప్పించుకోలేకపోయాడని అధికారులు వివరించారు. అనంతరం మృతుని కుటుంబీకులను ఆయన పరామర్శించి ప్రభుత్వం తరపున ఐదు లక్షల పరిహారాన్ని ప్రకటించారు.ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి మరింత పరిహారం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

**ఏనుగుల కట్టడికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు..**

ఏనుగుల దాడులను నివారించి పంట, ప్రాణ నష్టం జరగకుండా కాపాడేందుకు కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిర్ణయం తీసుకోవడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు జరుగుతున్నాయని త్వరలో కుంకి ఏనుగుల ఏర్పాటుతో ఏనుగులను కట్టడి చేసేందుకు అవకాశం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అంతవరకు అటవీ సమీప ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ డి ఎఫ్ ఓ వేణుగోపాల్, ఎఫ్ ఆర్ వో నారాయణ, ఆసుపత్రి ఆర్ ఎం ఓ శారదా దేవి, బైరెడ్డిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టి, అటవీ శాఖ సిబ్బంది ఉన్నారు.

## వార్డు సభ్యునిగా సైతం...

# ఏనాడూ గెలవలేని జంగయ్య యాదవ్

- ఏ హెూదాతో అధికారిక కార్యక్రమాలలో తిరుగుతున్నారు
- సుధీర్ రెడ్డి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు వంతెన నిర్మాణం గుర్తుకు రాలేదా
- కమిషన్ల కోసం ఒత్తిడి తోనే కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు
- బిజెపి రాష్ట్ర నాయకులు ఏనుగు సుదర్శన్




**ఘట్‌కేసర్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** ఐదు సంవత్సరాలు బిఆర్ఎస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్న సుధీర్ రెడ్డికి ఈ రైల్వే వంతెన నిర్మాణం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఘట్కేసర్ మండల మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం ఘట్కేసర్ మండల కేంద్రంలోని, ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం ఉన్నప్పుడు రైల్వే వంతెన నిర్మాణం పై ఒక మాటైనా మాట్లాడని సుధీర్ రెడ్డి నేడు ప్రతిపక్షాలను విమర్శించడం సరికాదన్నారు. ఇండ్లు కోల్పోయిన బాధితులకు, నష్టపరిహారం ఇప్పిస్తానని చెప్పిన నాయకులు, ఈరోజుకు వారికి నయా పైసాకుడా నష్టపరిహారం ఇప్పించకుండా, ఇండ్లను కూల్చి వేస్తున్నారని, బాధితులు లబోదిబోమంటు తలలు బాదుకుంటుంటే, చూస్తున్నారే తప్ప, వారి దగ్గరికి వెళ్లి, ఏ నాయకుడు వారిని పరామర్శించడం లేదని వాపోయాడు. పేదలపై రాజకీయం చేస్తూ, ప్రతిపక్షా పార్టీలపై విమర్శలు చేయడమే వారి లక్ష్యం అని అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా చెప్పుకొని తిరుగుతున్న తోటకూర వజ్రేష్ యాదవ్, ఏనాడు సర్పంచిగాని, ఎమ్మెల్యేగా గాని గెలవలేని ఆయన అధికారిక కార్యక్రమాలలో, ఏ హెూదాలో తిరుగుతూ ప్రజలకు హామీలు ఇస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజలకు కల్లీ బొల్లి మాటలు చెప్పి దీక్షను విరమింపజేశారని విమర్శించారు. ఇప్పుడు వారి ఇండ్లను ఇష్టానుసారంగా కూల్చివేస్తూ వారికి తీరని నష్టాన్ని కలుగజేస్తున్నారని ఆయన అన్నారు. సుధీర్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇప్పించలేక పోయాడు కానీ ఇప్పుడు వారి దగ్గరికి వచ్చి ముసలి కన్నీరు కారుస్తున్నాడని ఎద్దేవా చేశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకోకుండా కాంట్రాక్టర్ దగ్గర కమిషన్లకు కక్కుర్తి పడుతూ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విమర్శించారు, 2013 లో ఆనాటి ప్రభుత్వాలు చేసిన భూ సేకరణకు మార్కెట్లు ధరలకు మూడు రెట్లు పరిహారం చెల్లించే చట్టాన్ని చేశామని భుజాలు తెరుచుకునే కాంగ్రెస్ పార్టీ నేడు నష్టపరిహారం విషయంలో ఎటువంటి న్యాయం చేయలేక పోతుందన్నారు. మార్కెట్ ధర 45వేలు ఉండగా, వారు 35వేలు మాత్రమే కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజల సమస్యపై నిటారుగా నిలబడి పోరాటం చేసే ఏకైక పార్టీ బిజెపిని ఆయన తెలిపారు. తమ అసమర్థతను కప్పిపుచ్చుకొని బిజెపి పార్టీపై అవాకులు చవాకులు పేలడం సరికాదని హెచ్చరించారు.

# రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు

**అధికారులను అభినందించిన జిల్లా కలెక్టర్ గౌతమ్**



**మేడ్చల్ కలెక్టరేట్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** భారత రాష్ట్రపతి పర్యటన విజయవంగా జరిగిందని అందుకు కృషి చేసిన అధికారులను మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అభినందించారు. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన విజయవంతం చేయడంలో జిల్లా స్థాయిలోని అన్ని శాఖల అధికారుల పాత్ర ఎంతో అభినందనీయమని వారు ఎంతో బాధ్యతాయుతంగా వారి విధులు నిర్వహించారని కలెక్టర్ పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది శనివారంతో ముగియడంతో ఆమె ఢిల్లీకి బయల్దేరిన అనంతరం కలెక్టర్ గౌతం మాట్లాడుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈనెల 17న హకీంపేట విమానాశ్రయానికి చేరుకొన్నప్పటి నుంచి ఐదు రోజుల పాటు తిరిగి వెళ్ళేంత వరకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఒకరినొకరు సమన్వయం చేసుకొంటూ ఎంతో బాధ్యతాయుతంగా తమ విధులు నిర్వహించారని పర్యటన విజయవంతంలో వారి భాగస్వామ్యం ఎంతగానో ఉందని అభినందించారు. రాష్ట్రపతి రానున్న నేపథ్యంలో ఆయా శాఖల అధికారులకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో ఎంతో కృషి చేశారని తెలిపారు. అలాగే పోలీసు అధికారులు, సిబ్బంది, జిల్లా రెవెన్యూ శాఖ, సవాచార, రహదారులు, విద్యుత్తు, అటవీ శాఖ, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ, సివిల్ సప్లయి, అగ్నిమాపక శాఖతో పాటు అన్ని శాఖల అధికారులు కలిసికట్టుగా పని చేయడం వల్లే రాష్ట్రపతి పర్యటన విజయవంతంగా ముగిసిందని ఈ విషయంలో పర్యటన ప్రారంభం నుంచి మొదలుకొని ముగిసేంత వరకు తమ విధులను బాధ్యతాయుతంగా నిర్వహించిన అధికారులు, సిబ్బంది అందరికీ కలెక్టర్ గౌతం అభినందనలు తెలిపారు.

## జనవరి ఒకటి నుండి...

# ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

**చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం**
**మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**




**శ్రీకాకుళం, డిశంబరు 21(నిఘా న్యూస్):** రాష్ట్రంలో ఉన్న రైతుల నుండి చివరి గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. టెక్కలి క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరించి రైతులకు నెలల తరబడి నగదు జమ చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో రిజర్వాయర్లులో 95 శాతం నీరు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. రైతాంగానికి స్పష్టమైన హామీ ఇస్తున్నానని,చివర గింజ వరకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని,రైతులు ఎలాంటి ఆందోళనలు చెందాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం ధాన్యాన్ని నిమిషాల్లో కొనుగోలు చేసి 48 గంటల్లో రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నట్లు చెప్పారు. అన్నధాత సుఖీభవ కింద 20 వేల రూపాయలు రైతులకు ఇస్తామన్నారు. అనివార్య కారణాల వలన పెన్షన్ తీసుకోకపోతే మూడు నెలలకు ఒక సారి పెన్షన్ తీసుకోవచ్చునని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం జనవరి ఒకటి నుండి ప్రారంభిస్తామని వెల్లడించారు. జిల్లాలో మూలపేట పోర్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని, పోర్టుకు అనుబంధంగా టూరిజం, పరిశ్రమలు తదితరమైనవి అభివృద్ధి చెందుతున్నారు.60 వేల కోట్లతో రిఫైనరీ ఏర్పాటు చేస్తామన్నారు.ఈ ప్రాంతంలో ఉన్న ప్రజలకు ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. భోగాపురం నుండి మూలపేట పోర్టు వరకు నాలుగు లైన్ల రోడ్డుకు డిపిఆర్ తయారు చేసినట్లు పేర్కొన్నారు. పర్యాటక రంగానికి పారిశ్రామిక హెూదా కల్పించడం వలన పర్యాటక రంగం అభివృద్ధి చెంది ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. టెక్కలిని మరింత అభివృద్ధి చేస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

# విలీనం వద్దు గ్రామ పంచాయతే ముద్దు

- ఉన్న గ్రామాలకే సౌకర్యం లేదు
- విలీన గ్రామాల ప్రజల ఆందోళన
- ఆర్డినెన్స్ రద్దు చేయాలని కలెక్టర్ కు అర్జీ



**కరీంనగర్‌రూరల్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థలో తమ గ్రామాలను విలీనం చేయొద్దని కోరుతూ కరీంనగర్ రూరల్ మండలం దుర్శెడ్, గోపాలపూర్ గ్రామాలకు చెందిన గ్రామస్తులు శనివారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు మంద రాజమల్లు మాట్లాడుతూ కరీంనగర్ మునిసిపల్ కార్పోరేషన్ కోసం గ్రామ పంచాయితిలుగా ఉన్న మా వ్యవసాయ ఆధారిత గ్రామాలు అయిన దుర్శెడ్, గోపాల్ పూర్ గ్రామలను విలీనం చేయడానికి చేసిన ఆర్డినెన్స్ ను రద్దు పరిచి మా గ్రామాలను గ్రామ పంచాయితిలుగానే ఉంచాలని నిరుపేద ప్రజలు, రైతులతో కలిసి కలెక్టర్ ను కోరినట్లు తెలిపారు. అలాగే ఫ్యాక్స్ ద్వారా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ పంపినట్టు తెలిపారు. మా గ్రామాల్లో వ్యవసాయం చేసేవారే అధికంగా ఉన్నారని, ఉపాధి హామీ కూలీలు, ఇతరత్రా వ్యవసాయ కూలి పనులు చేసుకొని జీవిస్తున్నారని, అలాంటి గ్రామాలను మునిసిపల్ కార్పోరేషన్లో విలీనం చేయుటకు బిసి మంత్రి కరీంనగర్ జిల్లా కలెక్టర్ కు గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారని, ఆరు గ్రామాలను కరీంనగర్ పట్టణంలో విలీనం చేయుటకు ఆర్డినెన్స్ కూడా జారి చేసారని తెలిసిందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు కూడ గతంలో చేపట్టినట్టు గుర్తు చేశారు. అయినా కూడా ప్రభుత్వం స్పందించకుండా శుక్రవారం అసెంబ్లీలో బిల్ పెట్టాడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ముఖ్యంగా మా గ్రామాలలో వ్యవసాయం, కూలి పనులు, ఉపాధి హామీ పనులు చేసుకొని జీవనోపాది పొందుతున్నవారు అధికంగా ఉన్నారని, మునిసిపల్ కార్పోరేషన్ లో కలిపితే ఉపాధి హామీ పనులు చేసుకోవడానికి వీలులేకుండా పోవడంతో పాటు ఎలాంటి ఉపాధి పొందకుండ ఉండే పరిస్తితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేసారు. మధ్యతరగతి ప్రజలమైనందున ప్రభుత్వానికి ఎక్కువ పన్నులు కట్టే పరిస్తితి లేదని, నగరపాలక సంస్థలో మా గ్రామాలను కలిపితే ఇంటి పన్ను, ఇంటి నిర్మాణ పర్మిషన్ కొరకు ఎక్కువ రుసుంలు కట్టుకొనే పరిస్తితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు విలీనం అయిన గ్రామాలకు ప్రభుత్వం ఎలాంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని, ఆ గ్రామాలు ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు.దీన్ని దృష్టిలో పెట్టుకొనైనా ప్రభుత్వం విలీనం ఆపాలని డిమాండ్ చేసారు. లేనిచో రాబోవు కాలంలో మరింత ఉధృతంగా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో దుర్శెడ్ సింగిల్ విండో చైర్మన్ తోట తిరుపతి, గోపాల పూర్ మాజీ సర్పంచ్ ఊరడి మంజుల మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్‌లు సుంకిశాల సంపత్ రావు, అరె శ్రీకాంత్, మాజీ సింగల్ విండో చైర్మన్ మంద రాజమల్లు, మాజీ వైస్ ఎంపీపీ వేల్పుల నారాయణ, కోరు కంటి వెంకటేశ్వరరావు, శ్రీరామోజు తిరుపతి, గోనె నరసయ్య, ముత్తునూరి రాజ కమల్, గుండేటి కుమార్, రైతులు ఉపాధి హామీ కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీల అభివృద్ధి నిరోధకుడు రాచమల్లు


- పర్సంటేజీలు తీసుకొని మేము పనులు చేయలేదు
- మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, వైస్ చైర్మన్ బంగారు రెడ్డి చేసిన అవినీతిని నిరూపిస్తానని సవాల్
- సర్పంచ్ కొని రెడ్డి శివ చంద్రారెడ్డి



**ప్రొద్దుటూరు, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** కొత్తపల్లె పంచాయతీ అభివృద్ధి నిరోధకుడు అడ్డుకుంది మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డే అని కొత్తపల్లె పంచాయతీ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అన్నారు.శనివారం తన కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తనపై చేసిన అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బంగారు రెడ్డి తనపై అవినీతి ఆరోపణలు చేస్తూ అందులో ఎమ్మెల్యే వరదకు అవినీతి సొమ్ములో భాగం ఉందని ఆరోపించడం సరికాదన్నారు. రానున్న రోజులలో వైసీపీ హయాంలో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు, వైస్ చైర్మన్ బంగారు రెడ్డిలు చేసిన అవినీతిని నిరూపిస్తానని సవాల్ విసిరారు. తాను ఏనాడు ప్రజల సొమ్మును ఆశించలేదని, ఎవరి దగ్గర డబ్బులు లంచంగా లేదా పర్సంటేజ్ తీసుకొని పనులు చేయలేదని తేల్చి చెప్పారు. వ్యాపారులు తనకు డబ్బు ఇచ్చినట్లు చేసిన ఆరోపణలను నిరూపించాలని, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ నందు వైసీపీ హయాంలో జరిగిన అవినీతి త్వరలో బట్టబయలు చేయనున్నట్లు తెలిపారు. తాను కులాయి కనెక్షన్ కు పది లక్షల రూపాయలు తీసుకున్నట్లు బంగారు రెడ్డి చేసిన ఆరోపణలపై ఘాటుగా స్పందించారు. కోటానుకోట్ల రూపాయల పంచాయితీ సొమ్ము కాజేసింది పర్సంటేజ్ లెక్కన పనులు అమ్ముకుంది రాచమల్లు కాదా అని నిలదీశారు. ఇకనైనా తనపై బురద చల్లే ఆరోపణలు మానుకోవాలని, లేని పక్షంలో వైసీపీ హయాంలో రాచమల్లు బంగారు రెడ్డిల అవినీతి బాగోతాన్ని బయట పెట్టక తప్పదని తీవ్రంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో కౌన్సిలర్ మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవజ్యోతి పాఠశాలలో మత ప్రచారం

- పాఠశాలలో హాస్టల్ కు ఎలాంటి అనుమతి లేదు
- యాజమాన్యం పైన కేసులు నమోదు చేయాలి
- ఏబీవీపీ హాస్టల్స్ రాష్ట్ర కన్వీనర్ రంజిత్ కుమార్



**ముస్తాబాద్, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలోని నవజ్యోతి ప్రైవేట్ పాఠశాలలో ఏబీవీపీ హిందూ సంఘాలు ఆందోళన చేపట్టారు.విషయం తెలిసిన వెంటనే పాఠశాలకు ఎంఈఓ రాజిరెడ్డి చేరుకోవడంతో హిందూ సంఘాలు వారికి వినతి పత్రం అందజేశారు.అనంతరం పాఠశాల పైన స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేణి రంజిత్ కుమార్ మాట్లాడుతూ ముస్తాబాద్ మండల కేంద్రంలోని నవజ్యోతి పాఠశాలలో శుక్రవారం మత ప్రచారం చేస్తూ పాస్టర్ లతో బైబిల్ బోధనలు పాఠశాలలో చేశారని,ఎలాంటి అనుమతి లేకుండా హాస్టల్ నడిపిస్తున్నారని తెలిపారు. పాఠశాల భవనానికి ఎలాంటి అనుమతులు లేక ఫైర్ సర్టిఫికెట్ లేకుండా భవనం పూర్తి కాకుండా నడుస్తుందన్నారు. పాఠశాల పక్కనే మానేరు కెనాల్ ఉందని దానిపై నుండి దారి ఉండడం వల్ల బస్సు ప్రమాదం జరిగే పరిస్థితి ఉందన్నారు.గతంలో కూడా జిల్లాలో ఇలాంటి ఘటనలు చాలా జరిగాయని వెల్లడించారు.ఈ విషయంపై జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ లోపెల్లి రాజురావు బీజేపీ మండల అధ్యక్షుడు మెరుగు అంజాగౌడ్ హిందూ సంఘాల నాయకులు మద్దికుంట రమేష్, బోల్గం కిషోర్,బండారి రాజేష్,ప్రకాష్ పాల్గొన్నారు.

# రైల్వే స్టేషన్ నిర్మాణానికి రాష్ట్రం సహాయ నిరాకరణ

**మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్**



**కాప్రా, డిసెంబర్ 21 (నిఘా న్యూస్):** సికింద్రాబాద్, కాచిగూడ, నాంపల్లి రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల తాకిడి ఎక్కువ అవ్వటం వలన రాకపోకలకు ఇబ్బంది అవుతుంది, కాబట్టి నరేంద్ర మోడీ చర్లపల్లి లో గొప్ప రైల్వే స్టేషన్ నిర్మాణం కావాలని, ఈ ప్రాంతాన్ని ఎంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సహకరించక పోయినా పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులతో 500కోట్ల రూపాయలతో చర్లపల్లి రైల్వే స్టేషన్ నిర్మాణమైందని ఈటల రాజేందర్ అన్నారు. వారం రోజుల పాటు మా నాయకత్వం అంతా రైల్వే అధికారులతో, రాష్ట్ర ప్రభుత్వంతో సమీక్షించి ఇక్కడ ఏర్పాట్లను పర్యవేక్షించనున్నామని తెలిపారు. డిసెంబర్ 28న కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి ఈ రైల్వే స్టేషన్‌ని తెలంగాణ ప్రజలకు అంకితం చేయబోతున్నామని ప్రజలందరు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com